Estd:2023

3rd ANNIVERSARY

# సూర్యసేన

మా అక్షరం ప్రజల మార్పు కోసం

తెలుగు దిన పత్రిక

RNI. NO.: TELTEL/2023/85598

www.sooryasena.com






శుక్రవారం FRIDAY || 17.07.2026 || నల్గొండ NALGONDA || సంపుటి (Volume): 3 సంచిక (Issue) : 295 || పేజీలు (Pages) : 8 వెల (Rs.) : 2/- || ఎడిటర్: పాల్వాయి జానయ్య Editor: Palvai Janaiah


### త్వరలో అసెంబ్లీకి...

# రోహిత్ వేముల బిల్లు

**హైదరాబాద్, జూలై, 16 (సూర్యసేన ప్రతినిధి):** ఉన్నత విద్యాసంస్థల్లో విద్యార్థులపై జరిగే వివక్షకు శాశ్వతంగా అడ్డుకట్ట వేస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. రోహిత్ వేముల తెలంగాణ (ఉన్నత విద్యలో వివక్ష నివారణ) బిల్లు 2026 రూపకల్పనపై ఏర్పాటైన క్యాబినెట్ సబ్ కమిటీ తొలి కీలక సమావేశం గురువారం రాష్ట్ర సచివాలయంలో డిప్యూటీ సిఎం అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో కమిటీ సభ్యులైన మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ విద్యాసంస్థల్లో వివక్ష లేని ప్రశాంత వాతావరణాన్ని తీసుకురావడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇందుకోసం చట్టాన్ని అత్యంత పటిష్టంగా రూపొందిస్తున్నట్లు ప్రకటించారు. బిల్లును త్వరలో అసెంబ్లీలో ప్రవేశపెడతామని చెప్పారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సియూ)లో జరిగిన రోహిత్ వేముల విషాద ఉదంతం కేవలం తెలంగాణనే కాకుండా దేశం మొత్తాన్ని కదిలించిందని ఆయన అన్నారు. నాడు వివక్షకు వ్యతిరేకంగా విద్యార్థులు చేసిన పోరాటంలో ప్రస్తుత లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్వయంగా యూనివర్సిటీకి వచ్చి సంఘీభావం ప్రకటించిన విషయాన్ని భట్టి గుర్తు చేశారు. విద్యార్థులకు జరిగిన అన్యాయాన్ని ప్రశ్నిస్తూ.. నాటి పిసిసి అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ యూనివర్సిటీ పూర్వ విద్యార్థిగా నేను, మంత్రి శ్రీధర్ బాబు, క్రియాశీలక నేత పొన్నం ప్రభాకర్‌లం పెద్ద



ఎత్తున పోరాడామని తెలియజేశారు. భవిష్యత్తులో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత విశ్వవిద్యాలయాల్లో ఎటువంటి వివక్ష లేని విద్యా విధానాన్ని, చట్టాన్ని తీసుకువస్తామని ఆనాడు ప్రజలకు ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం నెరవేర్చడానికి రోహిత్ వేముల చట్టాన్ని తీసుకొస్తుందని వివరించారు. బిల్లు రూపకల్పన ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను డిప్యూటీ సిఎం ఆదేశించారు. బిల్లు డ్రాఫ్టింగ్ ప్రక్రియను వేగవంతం చేసేందుకు అధికారులతో కమిటీ ఏర్పాటు చేయాలని చెప్పారు.

# ప్రాణహితకు మళ్లీ ప్రాణం

**ఖమ్మం బ్యూరో/అశ్వాపురం, జూలై, 16 (సూర్యసేన ప్రతినిధి):** దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి ప్రారంభించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రాణహిత చేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టును మళ్లీ పట్టాలెక్కించేందుకు తెలంగాణ ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఆశ్వాపురం మండలం, సత్తుపల్లి మండలం యాతాకుల కుంట టన్నెల్ వద్ద సీతమ్మసాగర్ బ్యారేజ్, సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ప నులను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిలతో కలిసి ప్రాజెక్టు వ్యూ పాయింట్ నుంచి నిర్మాణ పనులను పరిశీలించిన అనంతరం నీ టిపారుదల శాఖ అధికారులు మ్యాప్‌లు, సాంకేతిక నమూనా ల ద్వారా బ్యారేజ్, పంప్‌హౌజ్ లు, కాలువలు, విద్యుత్ అనుసంధానం, పంపింగ్ వ్యవస్థ, ఆయకట్టు, ఇప్పటివరకు పూ ర్తయిన పనులు, మిగిలిన పనులు, అవసరమైన నిధులు తదితర అంశాలను మంత్రులకు వివరించారు. అనంతరం జరిగిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో మం త్రి ఉ త్తమ్ మాట్లాడారు . తెలంగాణ రైతాంగ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని సాగునీటి రంగంలో చారిత్రాత్మక నిర్ణయాలతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకుసాగుతోందని అందులో భాగంగా రాష్ట్రంలో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సీతారామ ఎత్తిపోతల పథకం, సీతమ్మసాగర్ ప్రాజెక్టు, దేవాదుల ఎత్తిపోతల పథకాలను తమ ప్రభుత్వ హయాంలోనే పూర్తిచేసి రైతుల కలలను సాకారం చేస్తామని ఆయన ప్రకటించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ జాతీయ డ్యామ్ భద్రతా సంస్థ సూచనల మేరకు అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో కొనసాగుతోందని మంత్రి ఉత్తమ్ తెలిపారు.




అన్ని పరీక్షలు పూర్తయి భద్రతా ధృవీకరణ లభించిన తర్వాతే బ్యారేజీలను తిరిగి వినియోగంలోకి తీసుకువస్తామని స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ డీపీఆర్ లో ఉన్న నిబంధనలను బేఖాతరు చేస్తూ కాళేశ్వరాన్ని నిర్మించారని, అక్కడ ఫౌండేషన్ అస్సలు బాగోలేదని నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ తన నివేదికలో స్పష్టంగా తేల్చిందని పేర్కొన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలలో నీటిని నిల్వ చేస్తే అవి పూర్తిగా కూలిపోయే ప్రమాదం ఉందని ఎన్డీఎస్ఏ హెచ్చరించిందని ఆయన గుర్తు చేశారు. కాళేశ్వరం బ్యారేజీల్లో నీరు నిల్వ చేయకుండానే తెలంగాణ రైతులు రికార్డు స్థాయిలో పంట పండించారని మంత్రి తెలిపారు.

### వైభవంగా గోల్కొండ

# బోనాల జాతర ప్రారంభం..

**- అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన కొండా సురేఖ, పొన్నం- ఆలయ కమిటీకి రూ. 11 లక్షల చెక్కు అందజేత- భక్తి పారవశ్యంతో ఊగిపోతున్న లంగర్ హౌస్ పరిసరాలు**

**హైదరాబాద్, జూలై, 16 (సూర్యసేన ప్రతినిధి):** భాగ్యనగర సంస్కృతికి నిలువుటద్దంగా నిలిచే చారిత్రాత్మక గోల్కొండ కోటలో ఆషాఢ మాస బోనాల జాతర అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక ఉత్సాహం మధ్య ప్రారంభమైంది. ఈరోజు లంగర్ హౌస్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, అటవీ, దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హాజరై అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్.. మంత్రి కొండా సురేఖకు సంప్రదాయబద్ధంగా బోనం ఎత్తడం విశేషంగా నిలిచింది. శ్రీ గోల్కొండ జగదాంబికా మహంకాళి ఎల్లమ్మ అమ్మవారికి ప్రభుత్వ పక్షాన మంత్రులు అధికారికంగా పట్టువస్త్రాలు, మొదటి 'బంగారు బోనం' సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కోసం రూ. 11 లక్షల రూపాయల ప్రభుత్వ చెక్కును ఆలయ కమిటీకి అందజేశారు. ఉత్సవాల ప్రారంభం సందర్భంగా శివసత్తుల పూనకాలు, పోతురాజుల వీర విన్యాసాలు, డప్పు చప్పుళ్లతో లంగర్ హౌస్ పరిసర ప్రాంతాలన్నీ భక్తి పారవశ్యంతో ఊగిపోయాయి. ఈ వేడుకను కళ్లారా చూసేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆషాఢ బోనాల జాతరకు గోల్కొండ కోట తొలి వేదిక



కావడంతో, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. నగర నలుమూలల నుండి భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం ఉండటంతో, శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు ఎక్కడికక్కడ భారీ బందోబస్తును మోహరించారు.

### ఓట్లు వేయలేదనే కక్షతోనే సీతారామ

# ప్రాజెక్టును గాలికి వదిలేశారు

**ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు ఆదరించలేదని బీఆర్ఎస్ కక్షగట్టిందన్న పొంగులేటి**

**సీతారామ ప్రాజెక్టుకు తీవ్ర అన్యాయం చేసిందని మండిపాటు**

**అబద్ధాలు చెబుతూ కాలం గడుపుతున్నారని పొంగులేటి ఆగ్రహం**

**ఖమ్మం, జూలై, 16 (సూర్యసేన ప్రతినిధి):** ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు బీఆర్ఎస్ పార్టీని ఎప్పుడూ సరిగా ఆదరించడం లేదనే కక్షతోనే... ఆ జిల్లాకు అత్యంత కీలకమైన సీతారామ ప్రాజెక్టుతో పాటు పలు నీటి పారుదల ప్రాజెక్టులను గత పాలకులు గాలికి వదిలేశారని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలతో కలిసి ఈరోజు ఆయన ఖమ్మం జిల్లాలోని సీతారామ ప్రాజెక్ట్‌ను సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి పొంగులేటి మాట్లాడారు. గత ఎన్నికల్లో ఈ ప్రాంత ప్రజలు బీఆర్ఎస్‌కు ఓట్లు వేయలేదనే కోపంతో... గిరిజనులు అధికంగా ఉండే కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలకు లైఫ్ లైన్ లాంటి సీతారామ ప్రాజెక్ట్‌కు గత ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని పొంగులేటి ఆరోపించారు. ప్రాజెక్ట్ ప్రస్తుత పరిస్థితిని చూస్తుంటే కడుపు తరుక్కుపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్ష పాత్ర పోషించాల్సిన బీఆర్ఎస్ పెద్దలు కడుపులో విషం పెట్టుకుని, అబద్ధాలు ప్రచారం చేస్తూ కాలం గడుపుతున్నారని మండిపడ్డారు. పదేళ్ల పాలనలో ప్రజల కష్టాలను గుర్తించని నాటి నాయకులు... ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఎలా పనిచేస్తుందో చూసి జ్ఞానం తెచ్చుకోవాలని హితవు పలికారు. "గత ప్రభుత్వం కట్టిందని మేము ఏ ప్రాజెక్ట్‌ను వదిలేయం. ఎటువంటి భేషజాలకు, పట్టుదలకు పోకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దుతున్నాం. సీతారామతో పాటు కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను కూడా పునరుద్ధరించే తపనతో పనిచేస్తున్నాం" అని మంత్రి స్పష్టం చేశారు. దివంగత రాజశేఖర రెడ్డి హయాంలో ప్రాజెక్ట్‌లకు మహర్దశ పట్టినట్లే, ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో దశలవారీగా



నీటి పారుదల రంగాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. గత పాలకులు ఉన్న నిధులన్నీ కొల్లగొట్టినా... కాంగ్రెస్ ప్రభుత్వం ఆ లోటును భర్తీ చేస్తూ ఒకవైపు సంక్షేమ పథకాలను, మరోవైపు ప్రాజెక్టులను నడిపిస్తోందని పొంగులేటి వివరించారు. గతంలో ఈ సీతారామ ప్రాజెక్ట్‌కు కేవలం రూ. 115 కోట్లు మాత్రమే ఖర్చు చేసి వదిలేశారని... కానీ ఇప్పుడు తమ ప్రభుత్వం నిధులిచ్చి, 1,480 క్యూసెక్కుల నీటిని విడుదల చేసి ఖమ్మం, వైరా, సత్తుపల్లి తదితర ప్రాంతాల తాగునీటి అవసరాలను తీరుస్తోందని చెప్పారు. దీని ద్వారా ప్రస్తుతం 1.25 లక్షల ఎకరాలకు సాగునీటిని అందిస్తూ కరవు నుంచి రైతులను కాపాడుతున్నామని, అవసరమైతే అదనంగా కూడా నీటిని విడుదల చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం గట్టిగా పనిచేస్తోందని మంత్రి స్పష్టం చేశారు.

### మళ్లీ డీలిమిటేషన్ బిల్లు..?

# కేంద్రానికి కాంగ్రెస్ కీలక విజ్ఞప్తి

**ప్రధాని మోదీకి కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు ఖర్గే లేఖ**

**డీలిమిటేషన్‌పై అఖిలపక్ష సమావేశానికి డిమాండ్**

**సవరించిన బిల్లులపై ముందస్తు చర్చకు విజ్ఞప్తి**

**ఏప్రిల్‌లో లోక్‌సభలో ఆమోదం పొందని బిల్లు**

**న్యూఢిల్లీ, జూలై, 16 (సూర్యసేన ప్రతినిధి):** పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టనున్న సవరించిన డీలిమిటేషన్ బిల్లుపై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీని కోరారు. ఈ మేరకు గురువారం ఆయన ప్రధానికి లేఖ రాశారు. బిల్లును సభలో ప్రవేశపెట్టే ముందు పార్టీలకు వాటిని పూర్తిగా పరిశీలించే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈఏడాది మార్చి, ఏప్రిల్‌లో కూడా డీలిమిటేషన్ ప్రతిపాదనలపై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రికి పలుమార్లు లేఖలు రాసినా స్పందన రాలేదని ఖర్గే పేర్కొన్నారు. ఆ అభ్యర్థనలను కేంద్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోలేదని తెలిపారు. ఏప్రిల్ 17న లోక్‌సభలో ప్రవేశపెట్టిన రాజ్యాంగ సవరణ బిల్లు-2026కు అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీ లభించకపోవడంతో అదిఆమోదం పొందలేదని గుర్తు చేశారు. ఇప్పుడు అదే బిల్లును సవరించి వర్షాకాల సమావేశాల్లో మళ్లీ తీసుకురానున్నట్లు మీడియాలో వార్తలు వస్తున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సవరించిన డీలిమిటేషన్ ప్రతిపాదనలు, అనుబంధ అంశాలపై అన్ని రాజకీయ పార్టీలతో చర్చించాలని ఖర్గే లేఖలో కోరారు.



బిల్లులను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే ముందువాటిని అధ్యయనం చేసేందుకు తగిన సమయం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. డీలిమిటేషన్ బిల్లు-2026, కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లు-2026 కూడా ఏప్రిల్‌లో లోక్‌సభలో ఆమోదం పొందలేదు. ఈ ప్రతిపాదనల ప్రకారం లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో మహిళల రిజర్వేషన్ల అమలుకు మార్గం సుగమం చేయడంతో పాటు, లోక్‌సభ స్థానాల సంఖ్యను 850కు పెంచడం,1976 తర్వాత తొలిసారి దేశవ్యాప్తంగా నియోజకవర్గాల పునర్విభజన చేపట్టేందుకు అవకాశం కల్పించనున్నారు.






# డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి




గరిడేపల్లి ప్రతినిధి, జూలై 16 (సూర్య సేన): గరిడేపల్లి మండలం పొనుగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం పోలీసుల ఆధ్వర్యంలో డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గరిడేపల్లి ఎస్ఐ మాట్లాడుతూ మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తాయని, క్షణికానందం కోసం వాటికి బానిస కావొద్దని విద్యార్థులకు సూచించారు.

విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో ఉంటూ ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ అవగాహన కల్పించాలని కోరారు. పాఠశాలలు, గ్రామాల్లో గంజాయి, డ్రగ్స్ విక్రయాలు లేదా వినియోగం కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారమిచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ ఆదేశాల మేరకు నిషేధం....



**నాగార్జునసాగర్, జులై 16 (సూర్య సేన) :** కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాల్లో పాలాభిషేకాలు, జలాభిషేకాలు, జేసీబీలతో దండలు వేయడంపై టీపీసీసీ నిషేధం ఎఐసిసి తెలంగాణ ఇంచార్జి మీనాక్షి నటరాజన్ ఆదేశాల మేరకు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు టి. కుమార్ రావు విడుదల చేసిన సర్క్యులర్ ప్రకారం, ఏ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంలోనూ పాలాభిషేకాలు, జలాభిషేకాలు నిర్వహించరాదని ఆదేశించారు.

ఆహార వృథాకు దారితీసే ఈ పద్ధతులకు బదులుగా అవసరమైన వారికి ఆహార పంపిణీ చేపట్టాలని సూచించారు.

అలాగే జేసీబీలు, బుల్డోజర్లు వంటి భారీ యంత్రాలతో నేతలకు భారీ దండలు వేయడం కూడా నిషేధిస్తూ, ఉల్లంఘిస్తే క్రమశిక్షణ చర్యలు ఉంటాయని పేర్కొన్నారు.

# ఎల్ నినో ప్రభావం ఆయిల్ పామ్ తోటల్లో యాజమాన్య పద్ధతులు....

**– ఉద్యాన అధికారుల సూచనలు**

**సూర్యాపేట, జూలై 16 (సూర్య సేన) :** ఈ ఏడాది సూపర్ ఎల్నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో రైతులంతా ఎంతో ఆశతో సాగు చేస్తున్న ఆయిల్ పామ్ తోటల్లో ప్రత్యేక యాజమాన్య



పద్ధతులు పాటిం చడం ద్వారా మొక్కల్లో ఆరోగ్యాన్ని, ఉత్పాదకతలను నిలువరించే అవకాశం ఉంటుందని సూర్యాపేట జిల్లా ఉద్యాన అధికారి తీగల నాగయ్య, సాంకేతిక అధికారి ముత్తినేని మహేష్ లు ఒక ప్రకటనలో అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు పలు సూచనలు సలహాలు అందజేశారు. ఎల్ ని నో పరిస్థితుల్లో భూ ఉపరితల ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. పగటి పూట సాపేక్ష ఆర్ద్రత తగ్గుతుంది. దీని వల్ల వాతావరణంలో తీవ్రమైన కొరత ఏర్పడుతుందన్నారు. పొడి వాతావరణం పరిస్థితులు ఏర్పడి గెలలు పూర్తిగా తయారుకావు. మగ పుష్పగుచ్చాలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉందన్నారు. 3సంవత్సరాల కంటే తక్కువ వయస్సున్న పామాయిల్ మొక్కలకు వేరు వ్యవ స్థలు పైన నే ఉంటాయి కావునా పై మట్టి పొర ఎండిపోవడం వల్ల ఆ వేర్లు ప్రభావిత మవుతాయి. పొడి వాతావరణ ఎక్కువ కాలం కొనసాగితే మొక్కల మనుగడకు ముప్పు వాటిల్లుతుందిన్నారు. అదనపు నీటి పారుదల కొనసాగించకపోతే ఈ ప్రమాదం ఎక్కువగా ఉంటుందని చెప్పారు.

అధికారుల సూచనలు :

1. రక్షణాత్మక నీటిపారుదల, తేమ సంరక్షణ చర్యలు పాటించాలని, క్రమం తప్పకుండా సూక్ష్మ పద్ధతిలో నీటిపారుదల జరిగేలా చూసుకోవాలని చెట్టు దీర్ఘకాలిక తేమ ఒత్తిడికి గురికాకుండా



చూసుకోవాలన్నారు..

2. మల్చింగ్ పద్ధతి పాటించాలి :

మొక్క మొదలు చుట్టూ కత్తిరించిన ఆకులు లేదా సేంద్రీయ జీవ పదార్థాంతో ఒక పొరగా కప్పటం వల్ల నేలలోని తేమ గణనీయంగా ఆదా అవుతుందని,దీని వలన సూక్ష్మ వాతావరణాన్ని చల్లబరు స్తుందిని తద్వారా నీటి నష్టాన్ని తగ్గిస్తుందన్నారు.

3. అదనపు పొటాషియం మోతాదు వేయడం:

అధిక ఉష్ణో గ్రతల ఒత్తిడి ఉన్న కాలంలో తగినంత నీటిపారుదల లేకుండా అధికంగా ఎరువులు వేయకూడదు. నీటి ఒత్తి డిని తట్టుకోవడానికి ప్రతి చెట్టుకు ఇచ్చే సాధారణం కంటే 0.5కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ అదనంగా అందించాలి.



4. పరాగ సంపర్కం చేసే వీవిల్స్ను ప్రభావం:

అధిక ఉష్ణోగ్రతల వల్ల పరాగ సంపర్కం చేయు వివిల్స్ మనుగడ, విస్తరణ ప్రతికూలంగా ప్రభావితమయ్యే అవకాశం ఉంది. ఇది అంతిమంగా పరాగ సంపర్కం సరిగ్గా జరగకపోవ డానికి, ఫలితంగా గెలలు విచ్ఛిన్నం కావడానికి దారి తీస్తుంది. కొత్తగా ఏర్పాటుచేసిన, ఒంటరి తోటల్లో వీటి స్థిరనివాసం తగ్గే అవ కాశం ఉంది, కావున తోటల్లో తేమను పెంచడానికి బిందు సేద్య వ్యవస్థలో అవుట్లెట్ తెరిచి ఉంచాలని,వేడి ఒత్తిడిని తగ్గించడానికి కోకో, వోక్క వంటి అంతర పంటలు వేసుకోవాలని సూచించారు.

# విద్యార్థుల ఫీజు బకాయిలు విడుదల చేయాలని రామన్నపేటలో మహాధర్నా...

- విద్యార్థులకు వ్యతిరేకంగా తెచ్చిన జీవో నెంబర్ 9, ఆర్ఆర్ యాక్ట్ ను రద్దు చేయాలి
- ప్రభుత్వ నాయకులు కమిషన్లు రావనే విద్యార్థుల స్కాలర్షిప్లు ఇవ్వట్లేదు
- పల్లగొర్ల మోదీరాందేవ్





భువనగిరి / రామన్నపేట, జూలై 16 (సూర్య సేన): విద్యార్థుల ఫీజు బకాయిలు విడుదల చేయాలని జీవో నెంబర్ 9ను ఆర్ఆర్ యాక్ట్ రద్దు చేయాలని వేల మంది విద్యార్థులతో రామన్నపేటలో మహా ధర్నా నాయకులకు పోలీసులకు వాగ్వాదం తదినంతరం శాంతియుతంగా ధర్నా ముగించారు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు రాజ్యసభ ఆర్. కృష్ణన్న, బీసీ సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ర్యాగ అరుణ్న్ ఆదేశం అనుసారం బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ పల్లగొర్ల మోదీ రాందేవ్, బీజేవైఎం జిల్లా అక్కినపల్లి సైదులు, బిజెపి కార్యవర్గ సభ్యులు పల్లపు దుర్గయ్య, టిఆర్ఎస్ నాయకులు సురేష్, అఖిలపక్షం నాయకులు పాల్గొన్నారు. రామన్నపేట సుభాష్ సెంటర్లో మహాధర్నా రాస్తారోకో చేశారు విద్యార్థులు వారు మాట్లాడుతూ విద్యార్థులకు రావలసిన 10 వేలకోట్ల స్కాలర్షిప్ ఫీజు బకాయిలు ఇవ్వకుండా పేద విద్యార్థులను విద్యకు దూరం చేస్తుంది ఈ ప్రభుత్వం, విద్యార్థులకు వ్యతిరేకంగా తెచ్చిన జీవో నెంబర్ 9ను ఆర్ఆర్ యాత్రను రద్దు చేయాలన్నారు

విద్యార్థులకు రావలసిన ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలి, పూర్తి ఫీజులను ప్రభుత్వమే భరించాలి విద్యాశాఖ మంత్రిని నియమించి వెంటనే విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి, వేలాది కోట్ల రూపాయలు ఖర్చు చేసి గాంధీ విగ్రహాలు పెట్టడానికమూసి సుందరీకరణ ఫోర్త్ సిటీకి లక్షల కోట్లు ఉంటాయి గాని విద్యార్థులకు ఇవ్వడానికి ప్రభుత్వం దగ్గర డబ్బులు ఉండయా, ప్రభుత్వం స్కాలర్షిప్లు ఇవ్వక విద్యార్థులు అయోమయానికి గురవుతున్నారు కాలేజ్ యజమాన్యాలు ఫీజులు కడితేనే సర్టిఫికెట్లు ఇస్తామని విద్యార్థులను వేధిస్తున్న ఈ ప్రభుత్వానికి ఏమాత్రం చెలమతనం లేదు రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజా సమస్యలను పూర్తిగా విస్మరించింది అన్నారు ఇంజనీరింగ్ ఎంబీఏ ఎంసీఏ చదివే విద్యార్థులకు పూర్తి ఫీజు ప్రభుత్వమే భరించాలి సంక్షేమ హాస్టల్లకు సొంతభవనాలు నిర్మించాలి అప్పై చేసుకున్న ప్రతి ఒక్కరికి ఓవర్సీస్ స్కాలర్షిప్ ఇవ్వాలి మెస్ చార్జీలు పెంచాలి కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో పెట్టిన విద్యార్థులకు 5 లక్షల లక్షల భరోసా కార్డు ఇవ్వాలి 100రోజుల్లోనే విద్యార్థుల సమస్యలన్నీ పరిష్కరిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక విద్యార్థుల చావులపై పేలాలు ఏరుకుంటుంది ప్రభుత్వం 100 రోజుల్లో రాజీవ్ గాంధీ ఇంద్రగాంధీ విగ్రహాలు తప్ప రాష్ట్ర ప్రజల బ్రతుకులు ఏమి రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2.50 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలి ప్రభుత్వాన్ని నిరుద్యోగులు జబ్బకు సంచేసుకొని ఊరూరు తిరిగి అధికారంలో తీసుకొస్తే ఈ ప్రభుత్వం నిలువున ముంచింది హాస్టలకు సొంత భవనాలులేవు ఉన్న అద్దె కొంపలకు బెచ్చులూడి విద్యార్థులు చనిపోయే ప్రమాదం ఉన్న ఈ ప్రభుత్వం నిమ్మకు నీరు ఎత్తినట్లుగా వ్యవహరిస్తుంది ఆర్ కృష్ణన్న కొట్లాడి విద్యార్థుల కోసం పూర్తి ఫీజులను ప్రభుత్వమే భరించే విధంగా పెట్టిస్తే ఆ జీవోను ఈ ప్రభుత్వం ట్రస్ట్ బ్యాంక్ పెడతామని తుంగలోకి దొరుకుతుంది రాజకీయంగా ఆర్థికంగా విద్యా పరంగా ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ అగ్రవర్ణ ఎదవకుండా కుట్ర చేస్తున్నారు ప్రభుత్వం నాయకులు ఇక ఊరుకునే ప్రసక్తే లేదు ఈ ప్రభుత్వం వెంటనే విద్యార్థుల ఫీజు బకాయిలను విడుదల చేయాలి పెంచిన ఫీజులన్నీ ప్రభుత్వమే భరించాలి, ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేయాలి జనాభా తమాషా ప్రకారం గా ఎస్సీ ఎస్టీ బీసీలకు రాజకీయ అవకాశాలు కల్పించాలి విద్యారంగానికి నిధులు కేటాయించాలని లేనియెడల పెద్ద ఎత్తున ఎంపీ ఆర్ కృష్ణన్ ఆధ్వర్యంలో ధర్నాలు రాస్తారోకోలు బస్సులు దానాలు చేసి ప్రభుత్వని అట్టుడికిస్తామని హెచ్చరిస్తున్నాం. ఈ సమావేశంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ పల్లగొర్ల మోదీరాందేవ్, బీజేవైఎం కార్యదర్శి అక్కెనపల్లి సైదులు, బిజెపి కార్యవర్గ సభ్యులు పల్లపు దుర్గయ్య, టి ఎస్ ఎస్ ఏ ఊరెళ్ళ మహేష్ బీసీ సంఘం నాయకులు ఎడ్ల మహాలింగం, జినుకల కృష్ణ,బిఆర్ఎస్ నాయకులు సురేష్, మనీష్, అనిత, లింగస్వామి, వినయ్, వెంకట్, భాస్కర్, రమాదేవి, ఉషశ్రీ, ఉదయ్ శ్రీ, విగ్నేష్ తదితరులు పాల్గొన్నారులి

# సారా తరలింపు అడ్డుకుని టీవీఎస్ సీజ్

**హుజూర్నగర్ ప్రతినిధి, జూలై 16 (సూర్య సేన) :** హుజూర్‌నగర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మఠంపల్లి మండలం బాడవ తండాకు చెందిన బానోత్ సైదా టీవీఎస్ వాహనంపై చౌటపల్లికి ఐదు లీటర్ల సారా తరలిస్తుండగా ఎక్సైజ్ అధికారులు పట్టుకుని వాహనాన్ని సీజ్ చేశారు. నిందితుడి వద్ద నుంచి ఐదు లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఈ దాడి ఎక్సైజ్ ఎస్ఐ జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించగా కానిస్టేబుల్ గోపిరెడ్డి, డ్రైవర్ ఉపేందర్ పాల్గొన్నారు.



# గోల్కొండ బోనాలు ఆధ్యాత్మిక సాంస్కృతిక చైతన్యానికి ప్రతీక





**– తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మాజీ మంత్రి వి. హన్మంతరావు**

**హైదరాబాద్, జూలై 16 (సూర్య సేన) :** తెలంగాణ కుమ్మర్ల గోల్కొండ బోనాల ఉత్సవ సమితి ఆధ్వర్యంలో జూలై 16వ తేదీ గురువారం గోల్కొండలో శ్రీశ్రీశ్రీ జగదాంబిక అమ్మవారికి బోనం ధూప దీప నైవేద్యం సమర్పించే కార్యక్రమం జరిగింది. తెలంగాణ కుమ్మర్ల గోల్కొండ బోనాలు ఉత్సవ సమితి నిర్వహించిన కుమ్మర్ల తొలి బోనాల జాతరలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వం సలహాదారులు మాజీ మంత్రి వి .హన్మంతరావు మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకైనా హైదరాబాద్ గోల్కొండ బోనాలుకుమ్మర్లు అమ్మవారికి సమర్పించే కుమ్మర్ల బోనాల పండుగ సమాజంలో ఆధ్యాత్మిక సాంస్కృతిక చైతన్యానికి ప్రతిక అని అన్నారు. అమ్మవారి స్ఫూర్తితో మహిళలు అన్ని రంగాల్లో రాణించేట్లు శక్తి యుక్తులను సంతరించుకోవాలని మహిళా సాధికారిక ద్వారా మెరుగైన సమాజాన్ని నిర్మించే సారదులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. గౌరవ అతిథిగా హాజరైన రాష్ట్ర డిప్యూటీ ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క సతీమణి భట్టి నందిని మాట్లాడుతూ

అమ్మవారి దీవెనలతో వర్షాలు కురిసి పాడి పంటలు సమృద్ధిగా పండాలని కరువు కాటకాలు తీరాలని అన్నారు. అమ్మవారికి తొలి బోనం ఎత్తే కుమ్మర్ల సమాజానికి ఆదర్శంగా నిలవడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ కుమార సంఘం 880/2014 రాష్ట్ర శాఖ అధ్యక్షులు తెలంగాణ ఎకనామిక్ ఫోరం అధ్యక్షులు పత్రికా రచయిత నేదునూరి కనకయ్య అతిథిగాపాల్గొని మాట్లాడుతూ తెలంగాణ కుమ్మర్ల సామాజిక సాంస్కృతిక ఆధ్యాత్మిక కుమ్మరి వృత్తి నైపుణ్యం కళావైభవాన్నీ చాటడంలో బోనాలు ప్రముఖ పాత్ర వహిస్తాయని అనాదిగా గోల్కొండలో అమ్మవారికి కుమ్మరికొండలో (మట్టికుండలో) అన్నం వండి కుమ్మర్లు అమ్మవారికి నైవేద్యం సమర్పిస్తారు. మట్టికుండలో బోనం శ్రేష్ఠమైనదని. శాస్త్రీయతకు పర్యావర పరిరక్షణకు ప్రజారోగ్య రక్షణకు దోహద పడుతుందని అన్నారు.

తెలంగాణ కుమ్మర్ల గోల్కొండ బోనాలు ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి తెలంగాణ కుమ్మర సంఘం 880/2014 రాష్ట్ర శాఖ ప్రధాన కార్యదర్శి తెలంగాణ రాష్ట్ర కుమ్మర ఆత్మగౌరవ భవన్ ఉపాధ్యక్షులు కొల్లూరు అనిల్ కుమార్ మాట్లాడుతూ

కుండ సమాజంలో శుభ కార్యక్రమాలకు దర్పనమని

"ప్రకృతే పరమాత్మ "అని ప్రకృతిలోని మట్టితో తయారు చేసిన కుండలోనే అమ్మవారికి భోజనం నైవేద్యంగా సమర్పించడం వల్ల శుభాలు కలుగుతాయన్నారు. తెలంగాణ కుమ్మర్ల గోల్కొండ బోనాల ఉత్సవ సమితి కోశాధికారి దామ సత్యనారాయణ మాట్లాడుతూ కుమ్మర్లను గ్రామ దేవాలయాల్లో పూజారుగా నియమించి ఆర్థికంగా ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

తెలంగాణ కుమ్మర్ల గోల్కొండ బోనాలు ఉత్సవ సమితి కమిటీ చైర్మన్ ఆర్ కుమార్ అధ్యక్షులు ఆర్ విజయ కుమార్ ప్రేమ కుమార్ ఉపాధ్యక్షులుప్రధాన కార్యదర్శి కొల్లూరి అనిల్ కుమార్ ఉపాధ్యక్షులు కాకులారం శంకర్ రావులకొల్లు ప్రకాష్ కుమ్మరి నరసింహులు శ్రీ సిలివవేరు లాలయ్య సహాయ కార్యదర్శి కుమ్మరి రామచంద్రయ్య ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ చంద్రమోహన్ రావులకొల్లు రాంకుమార్ దామానంద కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# భారత్ గౌరవ్ సమ్మాన్--2026 నామినేషన్లకు ఆహ్వానం

**– విశిష్ట సేవలకు జాతీయ స్థాయి అవార్డుల పిలుపు**
**– ప్రతిభను గుర్తించే మహా వేదిక సిద్ధం**
**– ఆగస్టు 30 వరకు దరఖాస్తులకు అవకాశం**

**హైదరాబాద్, జూలై 16 (సూర్య సేన) :**

సామాజిక బాధ్యత, విద్య, జర్నలిజం, సాంస్కృతిక, కళా, సాహిత్య, వైద్య, సామాజిక సేవ తదితర రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వ్యక్తులను సత్కరించేందుకు "భారత్ గౌరవ్ సమ్మాన్--2026 ఊ సమ్మిట్" పేరుతో ప్రతిష్ఠాత్మక అవార్డుల ప్రదానోత్సవాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. ఈ కార్యక్రమాన్ని ఆసియా వేదిక్ ఇంటర్నేషనల్ కల్చర్ అండ్ స్ఫూర్తి అకాడమీ, స్ఫూర్తి ఇంటర్నేషనల్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్, స్ఫూర్తి సర్వీసెస్ సొసైటీ ఇండియా ( ఎన్ జి ఓ ) మరియు పీస్ ఆఫ్ ఇండియా ( ఎన్ జి ఓ ) సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి.


ఈ వేడుకలో గౌరవ డాక్టరేట్, ఉత్తమ జర్నలిస్ట్ అవార్డు, నారి శక్తి అవార్డు, సేవా రత్న, ప్రైడ్ ఆఫ్ భారత్, నంది అవార్డు, గ్లోబల్ అవార్డులు తదితర విభాగాల్లో ప్రతిభా వంతులను ఎంపిక చేసి ఘనంగా సత్కరించ నున్నారు. అవార్డులకు దరఖాస్తుల స్వీకరణ 2026 జూలై 9 నుంచి ప్రారంభమై 2026 ఆగస్టు 25 వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు తమ వివరాలను నిర్ణీత గడువులోగా సమర్పించాలని కోరారు.



కార్యక్రమానికి లయన్ డా. అకుల రమేష్ నాయకత్వం వహిస్తున్నారు. ఆయన స్ఫూర్తి సర్వీస్ సొసైటీ ఇండియా ( ఎన్ జి ఓ ) వ్యవస్థాపకుడు ఊ చైర్మన్గా సేవలందిస్తున్నారు. అలాగే 2018లో ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేయడంతో పాటు, తెలంగాణ వినియోగదారుల మండలి ప్రధాన కార్యదర్శి, జాతీయ మానవ హక్కుల బోర్డు కమిటీ సభ్యుడు, తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యుడు, పీస్ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంటి పలు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమం తెలంగాణ సారస్వత పరిషత్, కింగ్ కోటి, తిలక్ రోడ్, బొగ్గులకుంట, హైదరాబాద్ -- 500001లో నిర్వహించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలు, నామినేషన్లు మరియు నమోదు కోసం 8297726613, 9010177845 నంబర్లను సంప్రదించాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.




# కలెక్టర్... ఆకస్మిక తనిఖీలు!



**– తుంగతుర్తి, మద్దిరాల మండలాల్లో కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సుడిగాలి పర్యటన**

**సూర్యాపేట / తుంగతుర్తి ప్రతినిధి, జూలై 16 (సూర్య సేన) :** సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ జిల్లాలోని తుంగతుర్తి, మద్దిరాల మండలాల్లో ఆకస్మికంగా పర్యటించారు. తుంగతుర్తి మండలం సూర్యా నాయక్ తండాలో రైతులు సాగు చేస్తున్న పూల క్షేత్రాలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం మద్దిరాల మండలం పోలుమల్ల గ్రామంలోని ప్రభుత్వ విద్యాసంస్థలను సందర్శించి అక్కడి విద్యా ప్రమాణాలను, మౌలిక వసతులను తనిఖీ చేశారు. సూర్యా నాయక్ తండాలో పూల సాగు పరిశీలన రైతులు సాంప్రదాయ పంటల నుంచి లాభదాయకమైన వైవిధ్య పంటల వైపు అడుగులు వేయాలని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఈ సందర్భంగా సూచించారు. సూర్యా నాయక్ తండాలోని పూల తోటలను సందర్శించిన ఆయన..

సాగు విధానం, పెట్టుబడి వ్యయం, మార్కెటింగ్ తదితర వివరాలను స్థానిక రైతులను అడిగి తెలుసుకున్నారు. వాణిజ్య పరమైన పూల సాగు ద్వారా రైతులకు మెరుగైన ఆదాయం లభిస్తుందని హర్షం వ్యక్తం చేశారు. ఉద్యానవన శాఖ అధికారుల ద్వారా రైతులకు అవసరమైన డ్రిప్ ఇరిగేషన్, ప్రభుత్వ రాయితీలను సక్రమంగా అందించాలని సూచించారు. పూల మార్కెటింగ్‌కు తగిన సదుపాయాలు కల్పించేలా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

పోలుమల్ల ప్రభుత్వ బడుల్లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

అనంతరం మద్దిరాల మండలం పోలుమల్ల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలను కలెక్టర్ సందర్శించారు. గ్రామంలోని జడ్పీహెచ్ఎస్, ప్రాథమిక పాఠశాల, మరియు ప్రీ-ప్రైమరీ పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో కాసేపు ముచ్చటించి, వారి విద్యా ప్రమాణాలను స్వయంగా పరీక్షించారు. ఉపాధ్యాయులు పాఠాలను బోధించే తీరును గమనించిన కలెక్టర్, విద్యార్థులకు మరింత నాణ్యమైన విద్యాబోధన అందేలా చూడాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. పాఠశాలల పరిసరాలు, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్వహణను కలెక్టర్ పరిశీలించారు. వర్షాకాలం దృష్ట్యా పాఠశాలల ఆవరణల్లో గడ్డి, పొదలు పెరగకుండా, నీరు నిల్వ ఉండకుండా నిరంతరం శుభ్రంగా ఉంచాలని పంచాయతీ కార్యదర్శులను, పాఠశాల సిబ్బందిని ఆదేశించారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించి, నాణ్యమైన, పౌష్టికాహారాన్ని విద్యార్థులకు అందించాలని స్పష్టం చేశారు. తహసిల్దారులు సంబంధిత అధికారులు పాల్గొన్నారు



# విద్యార్థుల యూడైస్ నమోదు ఎప్పటికప్పుడు పూర్తి చేయాలి


## – రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు






**నల్గొండ, జూలై 16 (సూర్య సేన) :** రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి గురువారం రాత్రి హైదరాబాదులోని రాష్ట్ర సచివాలయం నుంచి విద్య, వ్యవసాయ, వైద్యారోగ్య తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. పాఠశాలల్లో విద్యార్థుల యూడైస్ నమోదు ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని సి ఎస్ చెప్పారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలన్నారు. కేంద్రీకృత ఆహారశాల ఏర్పాటు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. యూనిఫాంల ను త్వరితగతిన సిద్ధం చేసి విద్యార్థులకు అందించాలని తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అన్నారు. జిల్లాల వారిగా వర్షపాతం, పంటల సాగు, ఎరువులు, విత్తనాల లభ్యతను సమీక్షించారు. అన్ని జిల్లాల్లో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందించాలని వివరించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. పంట మార్పిడి విధానాలు, ఆయిల్ పామ్, కూరగాయల పంటల సాగు వైపు రైతులను ప్రోత్సహించాలని అన్నారు. ప్రాజెక్టుల్లో నీటి మట్టం వివరాలు సమీక్షించారు. కాలానుగుణ వ్యాధులు వ్యాపించకుండా తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మెరుగైన పారిశుద్ధ్య పనులు నిరంతరం కొనసాగించాలన్నారు. అన్ని ప్రభుత్వాసుపత్రుల్లో అవసరమైన వైద్యసేవలు అందించాలని తెలిపారు. కలెక్టర్ బి. చంద్రశేఖర్, రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ ,జిల్లా రెవెన్యూ అధికారి దశరథ, ఆర్ అండ్ బి ఈ ఈ శ్రీధర్ రెడ్డి , స్థానిక సంస్థల ఇన్చార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేఖర్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్ రావు, డిఎంహెచ్ఓ రాహుల్ ,జిల్లా వ్యవసాయ అధికారి వినోద్ కుమార్ ,ఇతర అధికారులు జిల్లా నుండి పాల్గొన్నారు.

# కిడ్నీ సమస్యతో బాధపడుతున్న పేదింటి తల్లి






**– దాతల సహాయం కోసం ఎదురుచూస్తున్న కుటుంబ సభ్యులు**

**– మనసున్న మారాజులారా...ఒక ప్రాణాన్ని కాపాడండి అంటూ వేడుకోలు**

**నల్గొండ / మాడుగులపల్లి జూలై 16 (సూర్య సేన) :** ఓ పేదింటి తల్లికి ఆపద వచ్చింది కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతుంది మెరుగైన వైద్యం అందించేందుకు చిల్లిగవ్వలేదు మనసున్న మహారాజులు తమకు తోసినంతలో సహాయం చేసి నిండు ప్రాణాన్ని కాపాడాలని కుటుంబ సభ్యులు దాతలను కోరుతున్నారు. మాడుగులపల్లి మండలం, తోపుచర్ల గ్రామానికి చెందిన ఓ పేద కుటుంబం ఆర్థిక కష్టాలతో కన్నీటి పర్యంతమవుతోంది. ఆ ఇంటి ఇల్లాలు, ఇద్దరు చిన్నారులకు తల్లి అయిన 35 ఏళ్ల పాల్వాయి సైదమ్మ తీవ్ర కిడ్నీ వ్యాధితో ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నారు. కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న సైదమ్మకు మెరుగైన వైద్యం అందించేందుకు కుటుంబ సభ్యులు తమ వద్ద ఉన్న ఆస్తిపాస్తులను అమ్ముకుని, అప్పులు చేసి చికిత్స కొనసాగించారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమెకు తక్షణమే కిడ్నీ మార్పిడి కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ చేయాలని వైద్యులు సూచించారు.

రోజువారీ కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న భర్త పాల్వాయి వెంకన్న, చాలీచాలని ఆదాయంతో ఇద్దరు కుమారులను చూసుకుంటూనే భార్య వైద్య ఖర్చులను భరించలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భార్య ప్రాణాలను కాపాడేందుకు చేతిలో ఉన్నదంతా ఖర్చు చేసిన ఆయన ఇప్పుడు దాతల సహాయం కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. వైద్యుల అంచనా ప్రకారం కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సకు సుమారు రూ. 10 లక్షల వరకు ఖర్చు అవుతుందని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతటి భారాన్ని భరించే స్థోమత లేకపోవడంతో, మనసున్న దాతలు తమకు తోచినంత ఆర్థిక సహాయం అందించి సైదమ్మకు పునర్జన్మ ప్రసాదించాలని వారు కన్నీటి వేడుకతో కోరుతున్నారు. మీరు చేసే చిన్న సహాయం మా కుటుంబానికి పెద్ద అండగా నిలుస్తుంది. ఇద్దరు చిన్నారుల తల్లిని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ స్పందించి ఆదుకోవాలని కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు. సహాయం చేయదలిచిన దాతలు గూగుల్ పే / ఫోన్‌పే: 99495 25672 కి పంపించగలరని కోరుతున్నారు.

# ఆస్తి కోసం అత్తను హత్య చేసిన కోడలు



**– తూర్పుగూడెంలో సంచలనం.. సహజ మరణంగా చిత్రీకరించిన ఘటనను ఛేదించిన తుంగతుర్తి పోలీసులు**

**సూర్యాపేట, జూలై 16 (సూర్య సేన) :** సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం తూర్పుగూడెం గ్రామంలో చోటుచేసుకున్న కొణతం భాగ్యమ్మ అనుమానాస్పద మృతి కేసును తుంగతుర్తి పోలీసులు ఛేదించారు. ఆస్తి వివాదమే హత్యకు కారణమని తేలడంతో మృతురాలి కోడలు కొణతం మధురను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సూర్యాపేట డీఎస్పీ ప్రసన్న కుమార్ వెల్లడించారు. సూర్యాపేట డీఎస్పీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఏప్రిల్ 28, 2026న తూర్పుగూడెం గ్రామానికి చెందిన కొణతం భాగ్యమ్మ అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందిందని తెలిపారు. మృతురాలి కుమార్తె ఉప్పు శోభారాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు తుంగతుర్తి పోలీసులు అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసి లోతుగా విచారణ చేపట్టగా అసలు విషయం వెలుగులోకి వచ్చిందన్నారు. పోలీసుల వివరాల ప్రకారం, భాగ్యమ్మ పేరిట తూర్పుగూడెం గ్రామంలో సుమారు ఆరు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఆ భూమిలో తనకు వాటా కావాలని కుమార్తె శోభ తుంగతుర్తి కోర్టులో కేసు దాఖలు చేయడంతో కుటుంబంలో కొంతకాలంగా విభేదాలు కొనసాగుతున్నాయి. ఏప్రిల్ 26న శోభ తన తల్లిని కలిసి భూమి వాటా విషయమై మాట్లాడి వెళ్లిన విషయం తెలుసుకున్న కోడలు మధుర, మరుసటి రోజు రాత్రి ఈ విషయంపై అత్తతో వాగ్వాదానికి దిగింది. మృతురాలు కనీసం రెండు ఎకరాల భూమిని కుమార్తెకు ఇవ్వాలని చెప్పడంతో ఆగ్రహానికి గురైన మధుర, భూమి మొత్తం తనకే దక్కాలనే ఉద్దేశంతో భాగ్యమ్మను బలంగా తోసివేసింది. అనంతరం మళ్లీ వెనుక నుంచి పట్టుకుని మంచంపైకి నెట్టడంతో ఆమె తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందినట్లు విచారణలో వెల్లడైందని డీఎస్పీ తెలిపారు. హత్య అనంతరం భాగ్యమ్మ మంచం మీద నుంచి పడిపోవడంతో సహజంగా మృతి చెందిందని బంధువులను నమ్మించే ప్రయత్నం చేసినట్లు పోలీసులు తెలిపారు. అయితే అంత్యక్రియలకు ముందు మృతదేహానికి స్నానం చేయిస్తుండగా శరీరంపై గాయాలను గమనించిన కుమార్తె శోభారాణి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు మలుపు తిరిగింది. సాంకేతిక ఆధారాలు, సాక్షుల వాంగ్మూలాలు, శాస్త్రీయ విచారణ ఆధారంగా నిందితురాలు కొణతం మధురను జూలై 15న అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు డీఎస్పీ ప్రసన్న కుమార్ తెలిపారు. నిందితురాలి వద్ద నుంచి ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. విలేకరుల సమావేశంలో తుంగతుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి. ఉపేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# మామిళ్ళగూడెం వెంకటేశ్వర పాఠశాలలో డ్రగ్స్ రహిత సమాజంపై పోలీసుల అవగాహన సదస్సు.....

**మోతే, జూలై 16 (సూర్య సేన):** మోతే మండల పరిధి మామిళ్లగూడెం మామిళ్ళగూడెంలో యువత, విద్యార్థులు మాదకద్రవ్యాల (డ్రగ్స్) బారిన పడకుండా, వారి ఉజ్వల భవిష్యత్తును కాపాడుకోవడమే లక్ష్యంగా మోతే పోలీసుల ఆధ్వర్యంలో గురువారం మామిళ్ళగూడెంలోని వెంకటేశ్వర పాఠశాల విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. మోతే ఎస్ఐ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు డ్రగ్స్ మరియు గంజాయి వల్ల కలిగే భయంకరమైన అనర్థాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మోతే ఎస్ఐ మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో కూడిన అలవాట్లను అలవర్చుకోవాలని, చదువుపైనే పూర్తి శ్రద్ధ పెట్టాలని సూచించారు. తెలియని వయసులో, సరదా కోసం అలవాటు చేసుకునే వ్యసనాలు జీవితాలను మరియు కుటుంబాలను అతలాకుతలం చేస్తాయని హెచ్చరించారు. డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాలకు అలవాటుపడితే శారీరక, మానసిక ఆరోగ్యం నాశనమవ్వడమే కాకుండా చట్టపరమైన కఠిన చర్యలను ఎదుర్కొని భవిష్యత్తును పాడుచేసుకోవాల్సి వస్తుందని స్పష్టం చేశారు. పాఠశాల పరిసర ప్రాంతాల్లో గానీ, గ్రామాల్లో గానీ ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే లేదా డ్రగ్స్, గంజాయి విక్రయాలు జరుపుతున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే




మోతే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు. విద్యార్థులంతా డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు పోలీసులకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, పోలీస్ సిబ్బంది విద్యార్థులు పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# నేటి తరం తల్లిదండ్రులు, రేపటి తరం తల్లిదండ్రులకు స్ఫూర్తి కావాలి....

**– ప్రముఖ సంగీత దర్శకులు గాయకులు, లిటిల్ మ్యూజీషియన్ అకాడమీ వ్యవస్థాపకులు, డాక్టర్ కోమండూరి రామాచారి**

రంగారెడ్డి, జూలై 16 (సూర్య సేన): ఈనాటి తరం తల్లిదండ్రులు భవిష్యత్ తరాల తల్లిదండ్రులకు స్ఫూర్తిదాయకం కావాలని, ప్రముఖ సంగీత దర్శకులు గాయకులు, లిటిల్ మ్యూజీషియన్ అకాడమీ వ్యవస్థాపకులు, డాక్టర్ కోమండూరి రామాచారి అన్నారు. గురువారం రాత్రి శ్రీ శ్రీ శ్రీ గోదా సమేత వెంకటేశ్వర స్వామి, దేవస్థానం సంతోష్ నగర్ లో శ్రీ శారద సంగీత పీఠం, వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తమ పిల్లలను కేవలం చదువుతోనే కాకుండా వివిధ లలిత కళలలో వారి ప్రావీణ్యాన్ని బయటికి తీసేందుకు కృషి చేస్తున్న వారందరికీ ప్రణామాలు అర్పిస్తున్నానని ఈనాటి ఈ తల్లిదండ్రులు రేపటి తరానికి స్ఫూర్తి కావాలని అన్నారు. శారద విద్యాపీఠం సంగీత శిక్షణ శిబిరం నిర్వహిస్తున్న గుంటి సూర్యప్రభకు ఆయన అభినందనలు తెలిపారు. పాటతో ఆరోగ్యం పాటతో ఆనందం లభిస్తుందని శరీరం యావత్తు పాటతో స్పందిస్తుందని అన్నారు. నేటి తరం పిల్లలని సంగీతం వైపు మళ్ళిస్తే సమాజం శాంతియుతంగా ఉంటుందని అన్నారు. సంతోష్ నగర్ వెంకటేశ్వర స్వామి దేవాలయ ప్రధాన అర్చకులు, డాక్టర్ నల్ల దిగ శ్రీనివాసాచార్యులు మాట్లాడుతూ, మా సోదరుడి కుమారుడైన రామాచారి, నేను ఇద్దరం సహ విద్యార్థులం అని ఆయన పాట వైపు ప్రయాణం చేస్తే, నేను వెంకటేశ్వర స్వామి వెంట ప్రయాణం చేస్తున్నానని అన్నారు.

కార్యక్రమానికి హాజరైన 8 నంది అవార్డులు మూడు ప్రపంచ రికార్డులు ఇంటర్నేషనల్ చిత్రాల జ్యూరీ చైర్మన్ గోమాత సేవా ట్రస్ట్ చైర్మన్ ప్రముఖ సినిమా దర్శకులు గోస్వామి డాక్టర్ ఎన్ గోపాలకృష్ణ మాట్లాడుతూ తను ఎంతో మంది నటి మణులను చిత్ర సీమకు పరిచయం చేశారని వారిలో జయసుధ నటించిన “లక్ష్మణ రేఖ” చిత్రానికి తాను దర్శకత్వం వహించానని గోవును గౌరవించి గోవును పూజించాలని కోరారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సంతోష్ నగర్ దేవాలయ చైర్మన్ మాట్లాడుతూ ఈనెల 29వ తేదీన గోతులాభారం అనే కార్యక్రమాన్ని సంతోష్ నగర్ దేవాలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమానికి భారీ ఎత్తున భక్తులు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. మా ఆహ్వానాన్ని మన్నించి విచ్చేసిన డాక్టర్ కోమండూరి రామాచారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక ట్రస్ట్ నర్సింగ రావు తదితరులు పాల్గొన్నారు.



**– ప్రేక్షకులను అలరించిన అన్నమాచార్య సంగీత విభావరి.**

కార్యక్రమానికి ముందు శారదా విద్యాపీఠం అధినేత గుంటి సూర్య ప్రభ, శిష్య బృందం నేతృత్వంలో సమర్పించిన అన్నమాచార్యసంగీత విభావరి ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది కార్యక్రమంలో వెంకటాచార్య, సరిగమపదనిస, పపమద పదనిస, చిరు చిరు, పాలయో గోవిందా, చిట్టి చిట్టి పాదాలతో మెరిసినా వయా, మల్లెలు ముడిచే ఆండాలు, కోదండరామ కోదండరామ, బ్రహ్మమొక్కటే పర బ్రహ్మమొక్కటే, పాటలు విశేషంగా ఆకట్టుకోగా చిన్నారులు చేసిన నృత్యాలు కొండలలో నెలకొన్న కోనేటి రాయడు, బావములో నా భాగ్యము నందన అనే పాటలకు నృత్యాలు చేయగా ఎలక్ట్రిక్ ఇన్స్ట్రుమెంట్ పై రామకృష్ణ, వ్యవహరించారు. కార్యక్రమానికి దేవాలయ ప్రధాన అర్చకులు, డాక్టర్ నల్లదిగ శ్రీనివాసచార్యులు వందన సమర్పణ తో కార్యక్రమం ముగిసింది.

## సంపాదకీయం

శుక్రవారం, జూలై 17, 2026

# విపక్షాల ఐక్యతను బలోపేతం చేసిన మోడీ!

ప్రజాస్వామ్యంలో నిరంకుశం చేస్తామంటే కుదరదు. ప్రతి విషయంలోనూ అలాగే వ్యవహరిస్తున్న మోడీ, ఇప్పుడు 131వ రాజ్యాంగ సవరణ విషయంలోనూ అలాగే చేసారు. మహిళా బిల్లు సందర్భంగా సరిగ్గా అదే జరిగింది. బిజెపి నిరంకుశ విధానంపై ఓ రకంగా తిరుగుబాటుగానే భావించాలి. అలాగే విపక్షాలను ఐక్యం చేసిన ఘనత కూడా మోడీదనే చెప్పాలి. వారి ఓటు చెక్కుచెదరకుండా వేయగలిగారు. అలాగే వారంతా ఒక్కటిగా నిలబడేలా చేశారు. ఇది భవిష్యత్ రాజకీయాలకు కీలక మలుపుగా భావించాలి. అందుకే 131వ రాజ్యాంగ సవరణ వీగిపోయింది. ఇకపోతే మహిళా బిల్లు వేరు..డీ లిమిటేషన్ వేరు. 2023లోనే దీనిని ఆమోదించి, 2029 నుంచి అమల్లోకి తీసుకుని వస్తామని గతంలోనే చెప్పారు. అనూహ్యంగా ఇప్పుడు రెండూ కలగలిపి తీసుకుని రావడం ద్వారా బిజెపికి శృంగభంగం తప్పలేదు. నిజానికి ఈ బిల్లులను తీసుకుని వచ్చే ముందు అఖిలపక్షంలో చర్చించలేదు. విపక్షాలను విశ్వాసంలోకి తీసుకోలేదు. సొంతపార్టీలో చర్చించలేదు. ఎన్‌డిఎ పక్షాలతోనూ చర్చించలేదు. బహుశా మోడీ, అమిత్ షాలు మాత్రమే చర్చించుకుని ఈ సవరణ బిల్లుకు యత్నించి ఉంటారు. బహుశా వారు ఇలాంటి పరిణామం ఎదురవుతుందని కూడా ఊహించ ఉంటారు. దీనిని ఆసరాగా చేసుకుని విపక్షాలను ఎండగట్టాలన్న ఉద్దేశం కూడా ఇందులో దాగి ఉంటుంది. అయితే విపక్షాల ఐక్యత ఇప్పుడు మోడీకి సవాల్ కానుంది. మొన్న సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి సంపూర్ణ మెజార్టీ కోల్పోయింది. కేవలం ఎన్‌డిఎ పక్షాల మద్దతుతో ప్రభుత్వం కొనసాగుతోంది. కనీసం ఎన్‌డిఎ పక్షాలతో అయినా మోడీ సమగ్రంగా చర్చించి ఉంటారని అనుకోవడానికి లేదు. ఒకప్పుడు బిజెపిలో మేధావి వర్గం ఉండేది. ఏదైనా సమస్యను ముందు పార్టీలో మేధావి వర్గంతో చర్చించేవారు. ఎత్తులు వేసేవారు. కానీ మోడీ వచ్చాక పెద్దలను దూరం పెట్టారు. ఇప్పుడు పెద్దా, చిన్నా అంతా ఆయనే. అందుకే మహిళా బిల్లు ముసుగులో డీలిమిటేషన్ తీసుకుని రావాలన్న ఎత్తుగడలను ప్రతిపక్షాలు ఉమ్మడి గా చిత్తుచేశాయి. మహిళా బిల్లును ఉన్నపళంగా అమలు చేయడానికి విపక్షాలు సిద్దంగా ఉన్నాయి. కానీ మోడీ ఎందుకనో అలా చేయకుండా మెలికి పెట్టారు. డీలిమిటేషన్ వల్ల కూడా సభ్యుల సంఖ్య పెరిగితే కూడా నష్టమే. 542 స్థానాలు ఉన్న లోక్‌సభ 600 వరకు పెరిగితే ఫర్వాలేదు. కానీ 816 లేదా 850కి పెంచాలన్న తీరు మాత్రం ఆమోదించదగ్గది కాదు. రాజకీయంగా పదవులు పెరిగితే దేశానికి నష్టమే తప్ప లాభం లేదు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో బిజెపి వ్యవహరించిన తీరు, దానిని తరిస్కరించిన వైనం బిజెపికి గుణపాఠం కావాలి. ఇప్పటికైనా మేల్కొని ప్రజాస్వామ్య బద్ధంగా పాలన చేయకుంటే విపక్షాలు మరింత ఐక్యం అవుతాయని నిరూపించాయి. ఇప్పటికే సర్ ప్రక్రియ సెగరేపుతోంది. ఇప్పుడు 131 సవరణ తోడయ్యింది. ప్రజలు ఎప్పుడూ బిజెపి వెంటే ఉంటారని అనుకోవడానికి లేదు. తాజా 131 సవరణ ప్రతిపాదన దక్షిణాదిలో కూడా తీవ్ర చర్చకు దారితీసింది. తమకున్న అధికారం పోతోఉందని, తమ ప్రాతినిధ్యానికి విలువ ఉండదన్న భావనలో ఇక్కడి నేతలు వచ్చారు. అందుకే దక్షిణ్భాది నేతలు కేంద్ర ప్రభుత్వం హడావిడిగా తెచ్చిన నియోజకవర్గాల పునర్విభజన బిల్లుకు వ్యతిరేకంగా పోరాటం చేసారు. మోదీ సర్కారుకు ఓటమి రుచి చూపించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును ముందుపెట్టి.. డీలిమిటేషన్ బిల్లును ఆమోదింపజేసుకోవాలన్న కేంద్ర ఎత్తుగడను లోక్‌సభలో శుక్రవారం మూకుమ్మడిగా తిప్పికొట్టడం వెనక ఈ ఐక్యత స్పష్టంగా కనిపించింది. మహిళా రిజర్వేషన్ చట్ట సవరణ బిల్లు సభలో వీగిపోయేలా చేయటంలో దక్షిణాది రాష్ట్రాల ఎంపీలు కూడా కీలకపాత్ర పోషించారు. ఆంధ్రప్రదేశ్‌లోని పార్టీలు మినహా తెలంగాణ, కేరళ, తమిళనాడు, కర్ణాటకలోని ఎన్డీయే యేతర పార్టీల ఎంపీలంతా ఈ బిల్లును మరో ఆలోచనకు తావులేకుండా తిరస్కరించారు. తమిళనాడుకు చెందిన 38మంది, కేరళలోని 20 మంది, తెలంగాణలోని 9మంది, కర్ణాటకలోని 9 మంది ఎన్డీయే యేతర ఎంపీలు డీలిమిటేషన్ బిల్లును అడ్డుకోవటంలో కీలకపాత్ర పోషించారు. డీలిమిటేషన్ బిల్లును బహిరంగా తగులబెట్టి తమ నిరసన ఏ స్థాయిలో ఉంటుందో చూడాలని కేంద్రాన్ని తమిళనాడు సిఎం స్టాలిన్ సవాల్ చేశారు. పార్లమెంటులోనూ తమిళనాడు ఎంపీలు నల్ల దుస్తులు ధరించి బిల్లుకు వ్యతిరేకంగా బలంగా పోరాటం చేశారు. కొత్తగా జనాభా లెక్కలను సేకరించకుండానే మోదీ సర్కారు ఏకపక్షంగా, హడావిడిగా డీలిమిటేషన్‌కు పూనుకోవటం పై అందరిలోనూ అనుమానాలు బలపడ్డాయి. కేంద్రం దక్షిణాదికి ద్రోహం చేస్తోందని ఎలుగెత్తారు. తమ రాష్ట్రాల ప్రాతినిధ్యం లేకుండానే భవిష్యత్తులో ఉత్తరాది బలంతో కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు జరిగేలా దక్షిణాది ప్రాతినిధ్యంతో పనిలేకుండా చేయటమే మోదీ సర్కారు అసలు లక్ష్యమని విమర్శలు గుప్పిం చారు. రాజ్యాంగాన్ని బలహీనపర్చి, దేశ ఎన్నికల ముఖచిత్రాన్నే మార్చేయాలని కేంద్రం కుట్ర చేస్తోందని కమ్యూనిస్టు పార్టీలు కూడా పోరాటం చేశాయి. అందుకే కసిగా ఉన్న స్టాలిన్ 'ఢిల్లీని తమిళనాడు ఓడించింది' అని ప్రకటించారు. ఈ క్రమంలో ఇప్పుడు బిజెపి పునరాలోచన చేయాలి. పెద్దలను, మేధావులను గౌరవించడం అలవాటు చేసుకవాలి. కీలకమైన ఇలాంటి సవరణల సందర్భంలో విపక్షాలను విశ్వాసంలోకి తీసుకో వాలి. డీలిమిటేషన్ కూడా లిమిట్ దాటకుండా సీట్లను కుదించాలి.

సూర్యసేన

దినపత్రికలో
అన్ని రకాల ప్రకటనలు
అడ్వర్టైజ్మెంట్స్ మరియు
వార్తల కోసం

సంప్రదించండి: 9951241048


## చేనేత ధారణ"మాచన" ఓ ఉదాహరణ

# ముప్పై ఏళ్లుగా చేనేత కే జై











మాచన రఘునందన్..వృత్తి రీత్యా ప్రభుత్వ అధికారి పౌర సరఫరాల శాఖ లో ఎన్ఫోర్స్ మెంట్ డిప్యూటీ తాసీల్దార్. ప్రవృత్తి గా సమాజ హితశీ కూ పాటు పడతారు. ఈ అధికారి ప్రత్యేకత ఏమిటి అంటారా.. మూడు దశాబ్దాలు గా చేనేత వస్త్రాల మాత్రమే ధరించడమే గాక ..చేనేత రంగానికి చేతనైనంత చేయూత నిస్తున్నారు.

రఘు..ఎత్తు పొడుగు ఉన్నావ్ మంచి గట్టి బట్ట వేసుకో.. ఎంత సేపు ఆ హ్యాండ్ లూమ్ బట్టలేనా.?

నీ పిచ్చి కాక పోతే..

అని సాక్షాత్ జన్మ ఇచ్చిన అమ్మ మందలించినా..

అమ్మా..ఒక్క సారి చేనేత మగ్గం పై దీనంగా.. కూర్చుని వస్త్రం నేస్తున్న నేతన్న ను చూడు ,ఈ మాట అనవే అనవమ్మ అంటూ ..

అమ్మ కు నచ్చచెప్పాడు.

చేనేత వస్త్ర ప్రియుడు.మాచన రఘునందన్.

నారాయణ గూడ పద్మ శాలి భవన్ లో గురువారం హ్యాండ్ లూమ్ ఎక్స్ పో ప్రారంభం అయ్యింది.ఈ ప్రదర్శన కు విచ్చేసిన ఎంతోమంది కి చేనేత విశిష్టత వివరించారు మాచన రఘునందన్.

డియర్ సార్..ప్లీ..జ్ వియర్ హ్యాండ్లూమ్. అంటూ ప్రాధేయపడి మరీ పలకరించే తమ స్నేహితుడి కోసం చేనేత వస్త్రాలను ధరించే వారు కొందరైతే, వియర్ హ్యాండ్లూమ్.. బీ హ్యాండ్సమ్ అని మాచన రఘునందన్ చెబితే గాని చేనేత వస్త్ర ధారణ పై తమకు మక్కువ కలగలేదు,అనే వారు మరి కొందరు.

మాచన రఘునందన్. చేనేత వస్త్ర ప్రియుడిగా, ప్రోత్సహకుడిగా తన ఉనికిని చాటుకొనే ఈ వ్యక్తి వృత్తి రీత్యా అటు ప్రజా సేవకుడిగా పని చేస్తూనే ప్రవృత్తి గా చేనేత కు చేతనైనంత చేయూతనిస్తున్నారు ఈ ప్రజా సేవకుడు. చేనేత వస్త్రాల ను ధరించండి.. నేతన్నను ఆదరించండి. అంటూ అన్ని వర్గాల వారు విధిగా హ్యాండ్లూమ్ బట్టలు మాత్రమే వాడేలా శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారు. తెలంగాణ పద్మశాలి ఆఫీషియల్స్ ప్రోఫెషనల్స్ అసోసియేషన్ (టీ పొపా) కు రాష్ట్ర ప్రచార కార్యదర్శి గా వ్యవహరిస్తున్న మాచన రఘునందన్,చేనేతకూ ప్రత్యక్షంగా పరోక్షంగా ప్రచారం చేస్తూ నేతన్నల బాగుకు మాట సాయం తో పాటు బాట సాయం చేసే మంచి మనసున్న మనిషిగా దిల్ దార్ డిప్యూటీ తహసీల్దార్ గా ప్రజా సేవతో పాటు, సంఘ సేవ చేస్తున్నారు. సన్నిహితులకు, బంధువులకు. మిత్రులందరికీ చేనేత వస్త్ర విశిష్టత ను వివరిస్తూ..వారిచేత కూడా చేనేత ఉత్పత్తులనే వాడేలా చేస్తున్నారు మాచన రఘునందన్. అందరిచేత సాధ్యమైనంత మటుకు చేనేత వస్త్రాలను వినియోగించేలా చేస్తూ.హ్యాండ్లూమ్ కు తన జీవితంలో అంత్యంత ప్రాధాన్యతనివ్వడంతో ఆదర్శంగా నిలుస్తున్నారు..పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్.చదువుకునే రోజులనుంచే నిత్యం చేనేత వస్త్రాల వాడకం ఆరంభించారు.

తన వివాహ సమయంలో కూడా చేనేత వస్త్రాలను మాత్రమే విధిగా వాడేలా నియమం పాటించారు.

హ్యాండ్లూమ్ వస్త్ర వినియోగ ఉపయోగాలను సందర్భానుసారంగా జనబాహుళ్యానికి తెలిసేలా తన దైనందిన జీవితంలో..అనుదినం చేనేత వస్త్రాలనే ధరిస్తున్నారు. చేతిరుమాలు, తువ్వాలు, లుంగీలు,ఇలా ప్రతీ వస్త్ర ధారణకు చేనేత నే వాడుతున్నారు. ఉన్నతాధికారులకు చేనేత తువ్వా ళ్లతో సత్కరిస్తారు.

వియర్ హ్యాండ్లూమ్ అంటూ కరచాలనం సందర్భంగా పాలకరించటం తన ప్రత్యేకతగా చేసుకున్నారు.

కేవలం చేనేత వస్త్రాలనే విధిగా ధరిస్తున్నారు. కుటుంబం కూడా ధరించేలా చేశారు.ఇంట్లో సైతం దుప్పట్లు,మొదలు వివిధ రకాల వస్త్రాలంకరణ కోసం చేనేతనే ఉపయోగిస్తున్నారు. పుట్టినరోజు.వివాహదినోత్సవాలకు కానుకలుగా చేనేత ఉత్పత్తులనే అలంకార వస్తువులుగా ప్రత్యేకంగా తయారు చేయించి ప్రదానం చేస్తున్నారు.

సన్మానాలు,సత్కారాలకు శాలువాల బదులు కేవలం చేనేత తువ్వాళ్లను మాత్రమె వినియోగించాలని సూచిస్తున్నారు.హ్యాండ్లూమ్ ను ఆదరిస్తే.. ఒక నేత కార్మికుడి కుటుంబాన్ని ఆదుకున్నట్లే నని విషదీకరిస్తారు.అన్నం పెట్టే రైతన్న తర్వాత నేతన్న నే అని చెబుతారు.

చేనేత వస్త్రాల ధారణ కోసం ప్రభుత్వ ఉద్యోగులకు రుణ సదుపాయం ఉన్న విషయాన్ని గుర్తుచేస్తూ తన సహోద్యోగులను హ్యాండ్లూమ్ వస్త్రాల కొనుగోళ్లకై ప్రోత్సహిస్తున్నారు.చేనేత విశిష్టత,ప్రత్యేకత తగిన ప్రాధాన్యత తో వివరించే "మాచన" మాటలతో ఎందరో చేనేత ను అదరిస్తున్నారు.

# ఏఐతో భాషా ప్రావీణ్యం వస్తుందా?



మదిలోని భావాన్ని వ్యక్తపరచే వాహకమే భాష. ఇది నమ్మకాలను ప్రోదిచేస్తుంది. సంస్కృతిని నిర్మిస్తుంది. చరిత్రను ఆమోదిస్తుంది. ఒక జాతికి గుర్తింపు తెచ్చిపెడుతుంది. తొలినాళ్లలో దూరంగా ఉన్నవారికి సమాచారం అందించడానికి దూతను పంపేవారు. ఆ తర్వాత ఉత్తరం వచ్చింది. దాని తర్వాత వచ్చిన ఫోన్ మాట్లాడే దూరాన్ని చెరిపేసింది. దీనికి అదనంగా మెయిల్, వాట్సాప్ వంటి సమాచార సాధనాలు ఇబ్బడిముబ్బడిగా వచ్చాయి. ఇపుడు నేరుగా మాట్లాడడానికి వీడియో కాల్స్ అందుబాటులో ఉన్నాయి. అయితే, ఎన్ని సాధనాలు వచ్చినా భాష మాత్రం మారలేదు. అలానే ఉన్నది. అప్పుడు, ఇప్పుడు ఇద్దర్ని కలిపేది మాటే. సాధనాలు మారాయి. అంతే..కానీ ప్రేరణ అలానే నిలిచి ఉన్నది. కృత్రిమ మేధ ఇపుడు నేర్చుకోవడం, పని పద్ధతులను తిరగ రాస్తున్నది. ఇది గణిత సమీకరణాలను పరిష్కరిస్తున్నది. వ్యాసాలు రచిస్తున్నది. సంగీత బాణీలను కడుతున్నది. ఇలా ఎన్నో చేస్తున్నది. ఈ మేధ ట్యూటర్‌గా, అనువాదకునిగా, సహచరునిగానూ వ్యహరిస్తున్నది. తర్కం, స్థిరవ్యవస్థలపై నిర్మితమైన లెక్కలు, ఇంజినీరింగ్ తదితర శాస్త్ర విషయాలు ఇప్పటికే ఏఐ ప్రభావంతో రూపాంతరం చెందాయి. సంక్లిష్ట సైన్స్ సూత్రాల వివరాలు ఇప్పుడు ఏఐ ద్వారా తక్షణమే పొందగలుగుతున్నాం. కథలు చెప్పగలిగేవారే ప్రపంచంలో అత్యంత శక్తిమంతులు అంటారు పెద్దలు. మాట అంత మహత్తరమైనది. భాష ఒక జాతి సంస్కృతి, భావోద్వేగాల జీవన శ్వాస. ఏఐ వ్యాకరణాన్ని, పదజాలాన్ని వివరించగలదు. కానీ హాస్యం, వ్యంగ్యం, ప్రేమలు పట్టుకోలేదు. యంత్రం సాయంతో చేసిన అనువాదం సాంకేతికంగా సరిగానే ఉండవచ్చు. అయితే దీనిలో హృదయం లోపిస్తుంది. ఎవరైనా ఒకరు 'ఐ మిస్ యు' అంటే, దానిలో భావోద్వేగం ఇమిడి ఉంటుంది. ఆ ఉద్వేగ అనుభూతి యంత్రానికి సాధ్యం కాదు కదా! టెక్నాలజీ అనువాద క్రియను చాలా సులువు చేసింది. తెలుగు ఉత్తరమో, వ్యాసమో కేవలం క్షణాల్లో తప్పులు లేకుండా ఏఐ మరో భాషలోకి అనువదిస్తుంది. అది కచ్చితంగా ఉంటుంది. కానీ పేలవం అనిపిస్తుంది. అనువాదం అంటే ఒక భాష నుంచి మరో భాషలోకి తర్జుమా మాత్రమే కాదు కదా! అనువాదం అంటే విషయంలోకి పరకాయ ప్రవేశం చేసి అందించడం. అందుకే భాష భిన్నమైనదని భాషావేత్తలు చెప్తారు. సైన్స్ ఫార్ములా తెలుసుకోవడం ఓ వియుక్త నైపుణ్యం. మాట్లాడటమే భాష. మాటలో, నవ్వులో, స్వరంలో అనేక భావాలు దాగి ఉంటాయి. ఆలోచన చెప్పడంలో పొరపడి, జాగ్రత్తగా దిద్దుకుంటాం. ఇవి అన్నీ చిన్న చిన్న విషయాలు అనిపిస్తాయి. ఇవి తీపి, చేదు అనుభూతులు కలిగిస్తాయి. మనలో విశ్వాసం పెంపొందిస్తాయి. ఒకరితో ఒకరిని కలుపుతాయి. ఎందరో గురువులను అందిస్తాయి. భాష నేర్చుకోవడంలో మెలకువలు నేర్పుతాయి. ఇది సజీవ శిక్షణ. ఆ సజీవతను ఏ యాప్, చాట్ బోట్‌లు మనకు అందించగలవు? కృత్రిమ మేధో సాధనాలు పలు రకాలుగా సాయపడతాయి. అవి పలుకుబడిని సరిచేస్తాయి. వ్యాకరణాన్ని వివరిస్తాయి. ఇంకా వ్యక్తిగతీకరించిన అభ్యాసాన్ని అందిస్తాయి. ఇవి టీచర్లకు బాగా ఉపయోగపడతాయి. పాఠ్యప్రణాళిక రాసుకోవచ్చు, విద్యార్థుల నుంచి వేగంగా అభిప్రా యాలూ సేకరించవచ్చు. ఎదుటి వ్యక్తి మాటల్లోని భావోద్వేగాన్ని అర్థం చేసుకొనే ప్రయత్నాన్ని యంత్రాలు భర్తీ చేయలేవు. భాషాపటిమ ధారాళంగా మాట్లాడటం ద్వారా రాదు. సహానుభూతి ద్వారానే వస్తుంది. సజీవ భాషలు నిరంతరం అభివృద్ధి చెందుతూనే ఉంటాయి. యాస, మర్యాదపూర్వక సంభాషణా స్వరాలు మెల్లగా అనుభవంతో అలవడతాయి. యంత్రం వీటిని నమోదు చేయగలదు. కానీ అది మనిషి కాదు కదా! కనుక అది మన మాటల లయలో పాల్గొనలేదు. వినడం, అర్థం చేసుకోవడం, తగిన విధంగా ప్రతిస్పందించడం నిరంతర తర్ఫీదు, ఇదే నిజమైన భాషా ప్రావీణ్యత సాధనా మార్గం. గత కొన్ని దశాబ్దాలుగా పట్టణీకరణ జోరందుకున్నది. ఆంగ్ల మాధ్యమ కాన్వెంట్ చదువులు విస్తృతంగా పెరిగాయి. ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలంటే ఇప్పుడు ఇంగ్లిష్ తప్పని సరైంది. నేడు ఏ భాషనైనా ఏఐ పరికరాల సాయంతో అనువదించడం చాలా సులువైం ది. కష్టం లేకుండా చేస్తున్నది టెక్నాలజీ. ఇదే పెనుముప్పు కలిగించే అవకాశం ఉన్నది. భాష నేర్చుకోవలసిన అవసరం లేదనే భావన మనలో ఏర్పరుస్తున్నది. అందుకే టెక్నాలజీని నేర్పుగా వాడాలని భాషా శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. భాష నేర్వడం అంటే పదవినియో గం, శ్రద్ధగా వినడం, జవాబు చెప్పడం, చదవడం, రాయడం మాత్రమే కాదు, సాంస్కృతిక సందర్భం గుర్తెరగాలి. ఇది సామాజిక సంబంధాల ను నిలిపే సాధనం. కానీ వ్యక్తిత్వ ఎదుగుదలకు సోపానం. నూతన ఆలోచనా ప్రపంచాలను చేరువచేసే మార్గం. భాష నెమ్మదిగా వంటబ డుతుంది. ఇలా నేర్చుకోవడంలో భావోద్వేగం, మానవతలు మిళితమై ఉంటాయి. ఇదే నిజమైన భాషా పండిత్య సాధనకు సోపానం. దీర్ఘకాల ప్రయత్నంతోనే భాషా పటిమ పట్టుబడుతుంది. ఈ సాధనే భాష సజీవంగా నిలిచి వెలిగేలా చేస్తుంది. సైన్స్ ఫార్ములా తెలుసుకోవడం ఓ వియుక్త నైపుణ్యం. మాట్లాడటమే భాష. మాటలో, నవ్వులో, స్వరంలో అనేక భావాలు దాగి ఉంటాయి. ఆలోచన చెప్పడంలో పొరపడి, జాగ్రత్తగా దిద్దుకుంటాం. ఇవి అన్నీ చిన్న చిన్న విషయాలు అనిపిస్తాయి. ఇవి తీపి, చేదు అనుభూతులు కలిగిస్తాయి.




## ఘనంగా జగన్నాథ స్వామి రథయాత్ర మహోత్సవం




**సూర్యాపేట కల్చరల్, జూలై 16 (సూర్య సేన) :** శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయంలో గోదా మురళి స్వామి అండలు గోష్టి ఆధ్వర్యంలో గురువారం రాత్రి శ్రీ జగన్నాథ స్వామి రథయాత్ర మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. అనంతరం సాయంత్రం దేవాలయం వెలుపల నుంచి శ్రీ జగన్నాథ స్వామి పవిత్ర రథయాత్రను వైభవంగా నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణమంతా భక్తుల గోవింద నామస్మరణలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయ ప్రధాన అర్చకులు నల్లంచక్రవర్తుల మురళీధరచార్యులు, కందిమల్ల శంకర్ , మాశెట్టి విజయ్ కుమార్, గట్ల సోమయ్య, భైరూ విజయ్ కృష్ణ, శ్రీరంగం రాము తో పాటు మహిళా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# కురుక్షేత్రం ముగియలేదు... ప్రతి ఇంటా సాగుతూనే ఉంది!

మహాభారతం అనేది కేవలం ఒక ప్రాచీన కాలానికి సంబంధించిన పురాణ ఇతిహాస గ్రంథం మాత్రమే కాదు. అది యుగయుగాలుగా మానవాళి ఆలోచనా సరళిని అమితంగా ప్రభావితం చేస్తూ, సమకాలీన సామాజిక వ్యవస్థల గమనాన్ని నిర్దేశిస్తున్న ఒక అద్భుతమైన సజీవ కావ్యం. వేల సంవత్సరాల సుదీర్ఘ కాలం క్రితం వ్యాస మహర్షి కలం నుండి జాలువారిన ఈ విశిష్ట మహాసంగ్రామ గాథ, నేటి ఆధునిక కాలంలోనూ ప్రతి గృహంలోనూ, ప్రతి కార్యాలయంలోనూ, ప్రతి సగటు వ్యక్తి అంతరంగంలో ఏదో ఒక రూపంలో నిరంతరం పునరావృతమవుతూనే ఉంది. ఇంతటి ఘనమైన కావ్యం నిత్య నూతనంగా వెలుగొందడానికి గల లోతైన కారణాలను అన్వేషిస్తే, అది కేవలం ఆనాటి కురు వంశీయుల కథకు మాత్రమే పరిమితం కాకుండా, ప్రతీ మనిషిలో నిబిడీకృతమై ఉన్న శాశ్వత మానవ నైజంలోనే దాగి ఉందని మనకు స్పష్టమవుతుంది. మానవ మానసిక ప్రవృత్తులు, భావోద్వేగాలు, అంతర్గత సంఘర్షణలు కాలంతో పాటు ఎంతమాత్రం మారవనే సార్వజనీన సత్యాన్ని ఈ ఇతిహాసం అద్భుతంగా నిరూపిస్తోంది.నిజానికి కురుక్షేత్ర మహాసంగ్రామం అనేది ఎక్కడో సుదూర సరిహద్దుల్లో జరిగిన బాహ్య యుద్ధం కాదు, అది నిత్యం మన గృహాల్లోనే ఆరంభమవుతోంది.

మహాభారత కథకు ప్రధాన మూలహేతువు భూతగాదాలు, ఆస్తి పంపకాలు, అపరిమితమైన అధికార లాలస, సోదరుల మధ్య తలెత్తిన తీవ్రమైన అసూయాద్వేషాలు. ఈ రకమైన కుటుంబ కలహాలు కేవలం ఆనాటి రాజకుటుంబాలకే పరిమితం కాలేదు. ప్రస్తుత ఆధునిక సమాజంలో కూడా ఆస్తుల పంపకాల కోసం న్యాయస్థానాల చుట్టూ తిరిగే తోబుట్టువులు, తల్లిదండ్రుల పక్షపాత ధోరణులు, వారసత్వ పోరును మనం నిత్యం వార్తా పత్రికలలో చూస్తూనే ఉన్నాం. పుత్రవాత్సల్యంతో కళ్ళు మూసుకుపోయి, కుమారుడైన దుర్యోధనుడి ఘోర తప్పిదాలను చూసీచూడనట్లు వదిలేసిన ధృతరాష్ట్రుడి విలక్షణ ప్రవృత్తి, నేటి తరం తల్లిదండ్రుల మితిమీరిన గుడ్డి ప్రేమాభిమానాలకు ఖచ్చితమైన నిదర్శనం.

ఈ నేపథ్యంలో, కురుక్షేత్రం అనేది కేవలం ఒక చారిత్రక రణరంగం కాదు; అది అహంకారాలు, పరస్పర ప్రయోజనాలు ఢీకొనే ప్రతి సామాజిక వేదిక.సమాజంలో దుర్యోధనుడిని కేవలం ఒక క్రూరమైన ప్రతినాయకుడిగా ముద్రవేయడం చాలా తేలిక. కానీ నిష్పక్షపాతంగా ఆత్మపరిశీలన చేసుకుంటే, అతనిలోని అసూయ, ఈర్ష్య, స్వార్థం, నాకు దక్కనిది ఇతరులకు దక్కకూడదు అనే మొండి పట్టుదల వంటి మానసిక బలహీనతలు మనందరిలోనూ అంతర్లీనంగా దాగి ఉన్నాయి. తోటి సహోద్యోగుల ఉన్నతిని చూసి కుంగిపోవడం, పోటీదారుల విజయాన్ని అంగీకరించలేకపోవడం, మనకు హక్కు లేని విషయాలను కూడా బలవంతంగా చేజిక్కించుకోవాలనుకోవడం వంటివి నైతిక పతనానికి దారితీస్తున్నాయి. ఇవన్నీ ఆధునిక సామాజిక జీవనంలో రోజూ మనం చూసే సంఘటనలే. కాబట్టి, దుర్యోధనుడు ఎక్కడో లేడు, మన అహంలోనే దాగున్నాడు.రణరంగంలో ఆత్మీయులనే శత్రువులుగా చూసి, గాండీవాన్ని నేలపాలు చేసి హతాశుడైన అర్జునుడి విషాద యోగం అత్యంత భావోద్వేగభరితమైన ఘట్టం. నైతిక బాధ్యతలకు, వ్యక్తిగత బంధాలకు మధ్య నలిగిపోయే ఈ మానసిక సందిగ్ధత ప్రతి ఒక్కరి జీవితంలోనూ ఎదురవుతుంది. కార్యాలయంలో ఆత్మీయుడి తప్పును ప్రశ్నించాల్సి వచ్చినప్పుడు, నమ్మిన సిద్ధాంతాల కోసం బంధువులను వ్యతిరేకించాల్సి వచ్చినప్పుడు మనం తీవ్రమైన మానసిక మథనానికి గురవుతాము. ఈ నైతిక సంక్షోభాల సమయాల్లో సరైన మార్గాన్ని చూపేందుకే నాటి జగద్గురువు శ్రీకృష్ణుడు ఉపదేశించిన భగవద్గీత నేటికీ మానవాళికి అద్భుతమైన మార్గదర్శిగా నిలుస్తోంది.మహాభారతంలోని ప్రతీ పాత్ర మనుషుల మనస్తత్వాలలోని విభిన్న కోణాలను ఆవిష్కరిస్తుంది. శకుని ప్రతీకారేచ్ఛ సమాజంలోని విచ్ఛిన్నకర శక్తులను సూచిస్తే, కర్ణుడి జీవితం స్నేహానికి, అసాధారణ దాతృత్వానికి నిదర్శనం. జన్మరహస్యం కారణంగా తీవ్ర అవమానాలను ఎదుర్కొన్న కర్ణుడు, తనకు ఆశ్రయమిచ్చిన దుర్యోధనుడి పట్ల అచంచలమైన విశ్వాసం చూపాడు. అధర్మ పక్షాన నిలిచి వినాశనాన్ని కొనితెచ్చుకున్నా, కృతజ్ఞతాభావానికి అతడే ప్రతీక. మరోవైపు, నిండు సభలో ద్రౌపదికి జరిగిన పరాభవం, దానికి ఆమె చూపిన ప్రతిఘటన మహిళా ఆత్మగౌరవ పోరాటానికి దిక్సూచిగా నిలిచింది.భీష్మ పితామహుడు తన ప్రతిజ్ఞకు కట్టుబడి, సభలో ద్రౌపది వస్త్రాపహరణాన్ని నిశ్శబ్దంగా వీక్షించడం, ధృతరాష్ట్రుడు కేవలం పుత్రవ్యామోహంతో అధర్మాన్ని అడ్డుకోలేకపోవడం నేటి సామాజిక రుగ్మతలకు మూల కారణాలు. మన కళ్లముందు అన్యాయం జరుగుతున్నా నాకెందుకు అని మౌనంగా ఉండే ప్రతి సగటు మనిషిలోనూ భీష్ముడు, ధృతరాష్ట్రుడు కనిపిస్తారు. నిశ్శబ్దం కూడా ఒక ఘోరమైన నేరమేనని, దాని పర్యవసానాలు భావితరాలను దెబ్బతీస్తాయని ఈ పాత్రలు మనకు తీవ్రంగా హెచ్చరిస్తున్నాయి.ధర్మం అనేది ఎల్లప్పుడూ సులభమైన మార్గంలో సాగదు. సత్యసంధుడైన ధర్మరాజు సైతం యుద్ధంలో విజయం సాధించేందుకు అర్ధసత్యం పలకాల్సి రావడం, ధర్మాచరణలోని సంక్లిష్టతను తెలియజేస్తుంది. నైతిక విలువలకూ, ఆచరణాత్మక పరిస్థితులకూ మధ్య సమతుల్యతను కాపాడుకోవడమే జీవన పరమార్థం.సారాంశమేమిటంటే, మహాభారతం అనేది గతకాలపు చరిత్ర కాదు, అది మన వర్తమాన జీవితాల దర్పణం. అపరిమితమైన ఆశ, క్రోధం, అసూయ, కృతజ్ఞత, ద్రోహం, క్షమాగుణం, నైతికత వంటి విభిన్న శక్తుల నిరంతర ఘర్షణే మానవ ప్రస్థానం. మనం రోజువారీ జీవితంలో తీసుకునే ప్రతి చిన్న నిర్ణయంలో, మానవ సంబంధ బాంధవ్యాలలో ఈ పాత్రలు ఆవిష్కృతమవుతూనే ఉంటాయి. ఈ మహాగ్రంథాన్ని అధ్యయనం చేయడం అంటే, మనలో ఉన్న దుర్యోధన ప్రవృత్తిని అణచివేసి, అర్జునుడిలా నైతిక ధర్మంతో కర్తవ్యాన్ని నిర్వర్తించడమే. ప్రతి మనిషి జీవితమూ ఒక యుద్ధరంగమే. ఆ యుద్ధంలో నిలిచి ధర్మాన్ని జయింపజేయడమే మానవత్వానికి నిజమైన సార్థకత.

**డా .సూర్యదేవర రామకృష్ణ ,**
**9490754169**

# ఎల్‌నినో హెచ్చరిక: వరి విస్తీర్ణం తగ్గించండి -- ఆరుతడి పంటలకు ప్రాధాన్యత ఇవ్వండి

**– రైతులకు జిల్లా వ్యవసాయ శాఖ కీలక సూచనలు**

**నల్గొండ, జూలై 16 (సూర్య సేన) :** జిల్లాలో ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితులు, భూగర్భ జలాల తగ్గుదల, ప్రాజెక్టుల్లో నీటి లభ్యతపై నెలకొన్న అనిశ్చితిని దృష్టిలో ఉంచుకుని రైతులు వరి సాగు విస్తీర్ణాన్ని తగ్గించి ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సూచించారు. ఇప్పటికే వర్షాధార పంటల విత్తనాలు వేసిన రైతులు, బోర్లు, బావులు, లిఫ్ట్ ఇరిగేషన్ ఆధారంగా వరి నాట్లకు సిద్ధమవుతున్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. వ్యవసాయ శాఖ వివరాల ప్రకారం, 2025 జూన్ చివరినాటికి 8.68 మీటర్ల లోతులో ఉన్న భూగర్భ జలాలు, 2026 జూన్ చివరినాటికి 7.62 మీటర్ల స్థాయికి తగ్గాయి. రానున్న రెండు నెలల పాటు కూడా ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉ ండటంతో భూగర్భ జలాలు మరింత తగ్గే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. దీంతో వరి సాగుకు అవసరమైన నీటి కొరత ఏర్పడే అవకాశం ఉ ందన్నారు. ఈ నేపథ్యంలో బోర్లు, బావుల ఆధారంగా వరి సాగు చేయాలనుకునే రైతులు వరి విస్తీర్ణాన్ని కనీసం 25 శాతానికి పరిమితం చేసి, మిగిలిన 75 శాతం భూమిలో ఆరుతడి పంటలు సాగు చేయాలని సూచించారు. సాధ్యమైనంత వరకు మొత్తం విస్తీర్ణంలోనే ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయడం మంచిదని తెలిపారు. అదేవిధంగా నాగార్జునసాగర్, ఏఎంఆర్పీ, మూసీ, డిండి లిఫ్ట్ ఇరిగేషన్ వంటి నీటిపారుదల వనరులపై ఆధారపడే రైతులు కూడా నీటి లభ్యత అనిశ్చితంగా ఉన్నందున వరి స్థానంలో ఆరుతడి పంటలను ఎంచుకోవాలని సూచించారు. ప్రాజెక్టుల్లో నీటి కొరత కారణంగా విద్యుత్ ఉత్పత్తిపై కూడా ప్రభావం పడే అవకాశం ఉండటంతో బోర్లు, బావుల మోటార్లకు తగినంత విద్యుత్ సరఫరా కూడా అందకపోవచ్చని, అందువల్ల వరి సాగు విస్తీర్ణాన్ని తగ్గించుకోవడం అవసరమని వ్యవసాయ శాఖ స్పష్టం చేసింది. ప్రత్యామ్నాయంగా సాగు చేయదగిన పంటలు కంది, జొన్న, సజ్జ, రాగి, కొర్ర, నువ్వులు, ఆముదాలు, పొద్దుతిరుగుడు, ఫాడర్ జొన్న (పశుగ్రాసం), కూరగాయల పంటలు, ఎల్‌నినో పరిస్థితుల్లో ప్రతి రైతు ప్రతి ఎకరాన్ని సమర్థవంతంగా సాగు చేసి నష్టాలను తగ్గించి లాభాలు పొందేలా వ్యవసాయ శాఖ అన్ని విధాలుగా మార్గనిర్దేశం చేస్తుందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి తెలిపారు.

రైతులు నీటి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పంటల ఎంపికలో జాగ్రత్తలు పాటించాలని విజ్ఞప్తి చేశారు.

# 3లోగా సర్ ప్రక్రియ 100 శాతం పూర్తి చేసేందుకు చర్యలు – జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్



**నల్గొండ టౌన్, జూలై 16 (సూర్య సేన) :** జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ఆగస్టు 3 లోగా 100 శాతం పూర్తి చేయాల్సి ఉందని, ఇందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ కోరారు. గురువారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సర్ ప్రక్రియ పురోగతిపై సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఓటర్లకు 100 శాతం ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఇప్పటివరకు 78 శాతం మ్యాపింగ్, డిజిటలైజేషన్ పూర్తయిందని, రానున్న నాలుగు నుంచి 5 రోజుల్లో దీనిని 92 శాతానికి పెంచాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల సంఘం సర్ గడువును ఆగస్టు 3 వరకు పొడిగించిన నేపథ్యంలో ఈ లోగా 100 శాతం మ్యాపింగ్, డిజిటలైజేషన్ పూర్తి చేసేలా అన్ని రాజకీయ పార్టీలు తమ బూత్ స్థాయి ప్రతినిధులకు సహకరించాలని కోరారు. బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి ఫారాలను పంపిణీ చేసి, వాటిని పూరించడంలో ప్రజలకు సహాయం చేస్తున్నారని తెలిపారు. గ్రామాలు, మున్సిపాలిటీల్లో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేసి, వివిధ మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పించామని చెప్పారు. ఇప్పటికే ఎన్నికల సంఘం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం ఈఆర్‌వోలు క్షేత్రస్థాయి ప్రక్రియను పూర్తి చేశారని తెలిపారు. గుర్తింపు కేంద్రాలతో పాటు, మండల స్థాయిలోని ఎంఆర్వో కార్యాలయాల్లో కూడా బీఎల్‌వోలకు అవసరమైన సహకారం అందిస్తున్నామని చెప్పారు. జిల్లాలో ఇప్పటివరకు10లక్షల మ్యాపింగ్‌లు పూర్తయ్యాయని, ఇంకా 54 వేల మ్యాపింగ్‌లు పూర్తి చేయాల్సి ఉందన్నారు. పట్టణ ప్రాంతాల్లో ఇంకా 344 ఓట్లు గుర్తించాల్సి ఉందని తెలిపారు. బుధవారం నాటికి పెండింగ్ మ్యాపింగ్ పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

మ్యాపింగ్ ప్రక్రియ పూర్తైతే డబుల్ ఓటింగ్‌కు అవకాశం తగ్గుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజాప్రతినిధుల ఓట్లను కూడా ఇంటింటికి వెళ్లి నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి క్వాలిటీ అధికారులను నియమించి వెరిఫికేషన్ నిర్వహిస్తున్నామని, మరో 5 రోజుల్లో జిల్లాలో 92 శాతం మ్యాపింగ్ పూర్తి చేసే లక్ష్యంతో పనిచేస్తున్నామని చెప్పారు. సమావేశంలో పాల్గొన్న రాజకీయ పార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ, సర్ ప్రక్రియలో బీఎల్‌వోలు సమర్థవంతంగా పనిచేస్తూ మ్యాపింగ్‌ను వేగంగా ముందుకు తీసుకెళు _న్నారని అభినందించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నుండి ముంతాజ్ అలీ, బిఆర్ఎస్ తరపున బక్క పిచ్చయ్య, బిజెపి నుండి లింగస్వామి , ఆప్ ఆద్మీ తరపున అన్సారి, సిపిఎం నర్సిరెడ్డి, టిడిపి నుండి అన్నా రవి ,ఎన్సీపీనుండి రఫీ , బిఎస్పి తరపున రవిశంకర్, ఎన్నికల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్యవైశ్య సంఘం పరువును దిగజార్చవద్దు



**– పెద్దమనుషుల సమక్షంలో సమస్యను పరిష్కరించుకోవాలి**
**– అమరవాది లక్ష్మీనారాయణ నువ్వు రూ. 7 లక్షలు తీసుకునే సూర్యాపేటకు రావాలి**

**భానుపురి, జూలై 16 (సూర్య సేన) :** సూర్యాపేట పట్టణ ఆర్యవైశ్య సంఘం నాయకులు పదవుల విషయంలో ఒకరిపై ఒకరు సమస్యలు చేసుకుంటూ ఆర్యవైశ్య సంఘం పరువును దిగజార్చ వద్దని సూర్యాపేట పట్టణ ఆర్యవైశ్య సంఘం నాయకులు కలకోట లక్ష్మయ్య, కుక్కడపు శ్రీనివాస్, మీలా వంశీ లు అన్నారు. సూర్యాపేట పట్టణ ఆర్యవైశ్య కౌన్సిల్ సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్ పదవికి పోటీ ఉందని రద్దు చేస్తున్నట్లు ప్రకటించి నేడు రాచర్ల కమలాకర్ కు పదవి ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఇప్పటికే వర్కింగ్ ప్రెసిడెంట్గా రాచర్ల కమలాకర్ ఫ్లెక్సీలలో వేయించుకున్నాడని దీనిపై వీలైనంత త్వరగా నిర్ణయం తీసుకోవాలన్నారు. ప్రమాణ స్వీకారానికి ఇంకా మూడు రోజుల సమయం ఉన్నందున ఆర్యవైశ్య పెద్దమనుషుల సమక్షంలో సమస్యను పరిష్కరించుకోవాల్సిందిగా సూచించారు. పట్టణ ఆర్యవైశ్య సంఘ నూతన అధ్యక్షుడు బేలిదే శ్రీనివాస్ బే షజాలకు పోకుండా అందరిని సమాన దృష్టితో చూడాలని ఎన్నికల్లో తనకు ఓటు వేయని వారిని ప్రశ్నిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని ఇప్పటికైనా అలాంటి విధానాలు మార్చుకోవాలన్నారు. . రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ గత 11 సంవత్సరాలుగా అధ్యక్షుడిగా ఉండి సూర్యాపేట పట్టణ సంఘానికి చేసింది ఏమి లేదన్నారు. ఏదైనా కార్యక్రమం ఉందంటే అధ్యక్ష హోదాలో రావడమే తప్ప పట్టణ ఆర్యవైశ్య పేదలకు బీద విద్యార్థులకు చేసిందేమీ లేదన్నారు. ఆర్యవైశ్య సంఘం సభ్యత్వాల నమోదు రుసుములో 50% పట్టణ సంఘానికి రావాల్సి ఉండగా గత 12 సంవత్సరాలుగా రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. ఉ మ్మడి ఆంధ్రప్రదేశ్లో ఉండగా పేద ఆర్యవైశ్య విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం కోటి రూపాయలు డిపాజిట్ చేయడం జరిగిందని ప్రత్యేక తెలంగాణ అనంతరం 40 లక్షల రూపాయలు మన వాటా కింద రావడం జరిగిందన్నారు. ఆ డబ్బుల వడ్డీల రూపంలోనే సుమారు 60 లక్షలు వచ్చాయని నేటి వరకు వాటికి లెక్కలు లేవన్నారు. అట్టి నిధుల్లో సుమారు 7 లక్షల రూపాయలు సూర్యాపేట పట్టణ ఆర్యవైశ్య సంఘానికి రావాలని రేపు ప్రమాణ స్వీకారానికి వచ్చే అమరవాది లక్ష్మీనారాయణ ఆ ఏడు లక్షల రూపాయలు తీసుకొని కార్యక్రమానికి రావాలన్నారు. లేని పక్షంలో పరిస్థితులు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు వంగవీటి రమేష్, కొండ కరుణాకర్, మంచాల శ్రీనివాస్, పల్లెర్ల ప్రసాద్, తవిడిశెట్టి కృష్ణకుమార్, పసుమర్తి కృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.

# రూ.13 కోట్లతో మట్టపల్లి క్షేత్ర అభివృద్ధికి గ్రీన్ సిగ్నల్...

హుజూర్నగర్ ప్రతినిధి, జూలై 16 (సూర్య సేన): హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని మట్టపల్లి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా అనుమతి మంజూరు చేసింది.



ఆలయంలో పర్యాటక సౌకర్యాల అభివృద్ధితో పాటు బోటింగ్ ఏర్పాటు కోసం రూ.13 కోట్ల నిధులను విడుదల చేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ ప్రతిపాదన మేరకు పర్యాటక శాఖ ఇంజినీరింగ్ బృందం స్థలాన్ని పరిశీలించి అంచనాలు సిద్ధం చేయగా, వాటికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ నిధులతో ఆలయ పరిసరాల్లో పర్యాటక మౌలిక సదుపాయాలు, బోటింగ్ కార్యకలాపాల అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది.



# నకిలీ డీఏపీపై నిఘా పెంచాలి.....



**హుజూర్నగర్ ప్రతినిధి, జూలై 16 (సూర్య సేన):** హుజూర్‌నగర్‌లో నకిలీ డీఏపీ ఎరువుల విక్రయాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర నాయకుడు జనిగ సందీప్ సూర్యాపేట జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో, ముఖ్యంగా మఠంపల్లి మండలం, హుజూర్‌నగర్ పట్టణంలో నకిలీ డీఏపీ బస్తాలు విక్రయిస్తున్నట్లు సమాచారం ఉందని పేర్కొన్నారు. రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని అక్రమాలకు పాల్పడుతున్న ఎరువుల డీలర్లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. నాణ్యతలేని ఎరువుల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉన్నందున జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి నకిలీ ఎరువుల విక్రయాలను పూర్తిగా అరికట్టాలని విజ్ఞప్తి చేశారు.

# ఆరోపణలు నిరూపిస్తే అధ్యక్ష పదవికి రాజీనామా



**– ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్**

**సూర్యాపేట టౌన్, జూలై 16 (సూర్య సేన) :** తనపై జిల్లా యువజన అధ్యక్షుడు బొమ్మిడి అశోక్ చేసిన ఆరోపణలను నిరూపిస్తే వెంటనే అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తానని ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు బెలిదే శ్రీనివాస్ సవాల్ విసిరారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వాసవి కన్యక పరమేశ్వరి దేవాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.తాను గెలుపు కోసం కృషి చేసిన వారికి పదవులు ఇస్తానని ఎప్పుడూ చెప్పలేదని స్పష్టం చేశారు. యువజన అధ్యక్షుడిగా ఉన్న బొమ్మిడి అశోక్ ఆర్యవైశ్య సమాజానికి చేసిన సేవలేమిటో చెప్పాలని ప్రశ్నించారు. తాను అధ్యక్ష పదవిలో లేకపోయినా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించానని తెలిపారు. తనపై నిరాధార ఆరోపణలు చేసిన బొమ్మిడి అశోక్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో న్యాయపరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. అనంతరం పలువురు ఆర్యవైశ్య సంఘ సభ్యులు మాట్లాడుతూ, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవికి రూ.10 లక్షలు తీసుకున్నారనే ప్రచారం పూర్తిగా అవాస్తవమని ఖండించారు. సంఘంలో ప్రతి రూపాయి ఖర్చును సభ్యుల సమక్షంలోనే పారదర్శకంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. వ్యాపారాలను పక్కనబెట్టి సమాజ సేవ కోసం పనిచేస్తున్న వ్యక్తిపై ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం తగదని అన్నారు.పట్టణ ఆర్యవైశ్య సభ్యులకు పదవుల కేటాయింపు కూడా సభ్యులందరి సమక్షంలోనే జరుగుతుందని, వర్కింగ్ ప్రెసిడెంట్ పదవిని రద్దు చేశామని ఎప్పుడూ చెప్పలేదని, ఆ పదవిపై తుది నిర్ణయం తర్వాత తీసుకుంటామని స్పష్టం చేశారు. సంఘ వ్యవస్థ ప్రతిష్ఠను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదని సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిక్కుమళ్ల కృష్ణ, వుప్పల సత్యనారాయణ, రాచకొండ శ్రీనివాస్, వుప్పల శ్రవణ్ కుమార్, మిట్టపల్లి రమేష్, బొల్లం సురేష్, తోట లక్ష్మి నర్సయ్య, బచ్చు జగన్మోహన రావు, చల్లా సత్యనారాయణ, గుడిపాటి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ డెలివరీ వేగవంతం చేయాలి - రాష్ట్ర పౌరసరఫరాల డైరెక్టర్ జి వి. శ్యాం ప్రసాద్ లాల్.



**నల్గొండ, జూలై 16 (సూర్య సేన) :** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సీఎంఆర్ డెలివరీని వేగవంతం చేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ జి వి శ్యాం ప్రసాద్ లాల్ పౌరసరఫరాల అధికారులు , రైస్ మిల్లర్లను ఆదేశించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ఖరీఫ్ 100 రోజుల ప్రణాళికను పకడ్బందీగా అమలు చేయాలని చెప్పారు. గురువారం అయన నల్గొండ రెవిన్యూ అదనపు కలెక్టర్ ఛాంబర్ లో ఉమ్మడి నల్గొండ జిల్లా రైస్ మిల్లర్లు, పౌరసరఫరాల అధికారులతో కష్టం మిల్లింగ్ రైస్ పై సమీక్ష నిర్వహించారు. ఎఫ్ సి ఐ రేక్ మూమెంట్, స్థలాలు, ఎఫ్ సి ఐ పేమెంట్స్ తదితర అంశాలపై ఆయా జిల్లాల వారీగా సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ఖరీఫ్ వంద రోజుల ప్రణాళికపై సమీక్షిస్తూ 100 రోజుల కార్యాచరణ ప్రణాళికను వేగవంతం చేయాలని, ఎక్కడా ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. రానున్న ఖరీఫ్ కార్యాచరణ ప్రణాళిక కు పౌరసరఫరాధికారులతో పాటు, రైస్ మిల్లర్లు కూడా సిద్ధం కావాలన్నారు. సి ఎం ఆర్ డెలివరీలో భాగంగా ప్రతిరోజు డిఎస్ఓ లు పౌరసరఫరాల డిఎం లు మిల్లలవారీగా పర్యవేక్షణ చేసి సీఎంఆర్ డెలివరీని పెంచేయాలన్నారు. ప్రతి వారం మిల్లర్లతో సమావేశం ఏర్పాటు చేసి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని తెలిపారు. మిల్లులు 24 గంటలు నడిచేలా పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహసిల్దారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. రెవెన్యూ ఆదనపు కలెక్టర్ జే .శ్రీనివాస్, నల్గొండ పౌరసరఫరాల జిల్లా మేనేజర్ రాంపతి నాయక్, డిఎస్ఓ వెంకటేశ్వర్లు, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాల డీఎస్ ఓ లు, పౌర సరఫరాల డీఎంలు, ఉమ్మడి నల్లగొండ జిల్లా రైస్ మిల్లర్లు, సివిల్ సప్లై, ఎన్ ఫొసిమెంట్ విభాగాల అధికారులు, తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు.




# డ్రగ్స్‌కు దూరంగా ఉంటేనే ఉజ్వల భవిష్యత్



హుజూర్నగర్ ప్రతినిధి, జూలై 16 (సూర్య సేన): హుజూర్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం పోలీసుల ఆధ్వర్యంలో డ్రగ్స్ రహిత సమాజంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ హనుమాన్ మాట్లాడుతూ యువత దేశ భవిష్యత్తు అని, విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో ఉంటూ ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకోవాలని సూచించారు. డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాలకు అలవాటుపడితే శారీరక, మానసిక ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు చట్టపరమైన చర్యలు కూడా ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కళాశాల పరిసరాల్లో లేదా ఇతర ప్రాంతాల్లో డ్రగ్స్ విక్రయాలు, అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారమిచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి విద్యార్థి భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి..... రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

- ప్రాజెక్టుల్లో తాగునీటికి అవసరమైన నీటి మట్టాలు తప్పనిసరిగా నిర్వహించాలి
- అమృత్ పథకం తాగునీటి పనులను గడువులోగా పూర్తి చేయాలి
- వీబీజీఆర్ఏఎంజీ పథకంలో వర్షపు నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి
- సీజనల్ వ్యాధుల నివారణకు ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమాలు నిర్వహించాలి
- సూపర్ ఎల్‌నినో పరిస్థితుల దృష్ట్యా ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలి
- త్రాగునీరు, సీజనల్ వ్యాధులు, విద్యాశాఖ, సూపర్ ఎల్‌నినో పరిస్థితులపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన సీఎస్

**హైదరాబాద్ / సూర్యాపేట, జూలై 16 (సూర్య సేన):** తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, గురువారం త్రాగునీటి సరఫరా, సీజనల్ వ్యాధుల నియంత్రణ, విద్యాశాఖ, సూపర్ ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి త్రాగునీటి సరఫరా అత్యంత ప్రాధాన్యత అంశమని తెలిపారు. ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా అన్ని ప్రాజెక్టుల్లో తాగునీటికి అవసరమైన నీటి మట్టాలను తప్పనిసరిగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో (అమృత్) పథకం కింద చేపట్టిన తాగునీటి సరఫరా పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. (వీబీజీఆర్ఏఎంజీ) కార్యక్రమంలో భాగంగా ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వర్షపు నీటి సంరక్షణ నిర్మాణాలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ప్రతి గ్రామంలో పడే ప్రతి నీటి బొట్టును సంరక్షించేలా, ఇంకుడు గుంతలు, ఇతర నీటి సంరక్షణ పనులను సమర్థవంతంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కాలానుగుణ వ్యాధుల నివారణకు స్థానిక సంస్థలు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ప్రతి శుక్రవారం అన్ని గ్రామాలు, పట్టణాల్లో డ్రైడే కార్యక్రమాలను తప్పనిసరిగా నిర్వహించాలని, ప్రజల్లో "నీటిని నిల్వ ఉంచవద్దు" అనే అంశంపై విస్తృత అవగాహన కల్పించాలని




తెలిపారు. దోమల నివారణ చర్యలు, పారిశుద్ధ్య కార్యక్రమాలను నిరంతరం నిర్వహించాలని ఆదేశించారు. విద్యాశాఖకు సంబంధించి విద్యార్థులకు అందించాల్సిన యూనిఫాంలలో ఒక జతను ఆగస్టు 15 నాటికి తప్పనిసరిగా పంపిణీ చేసేలా జిల్లా స్థాయిలో కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. సూపర్ ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులను ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు ప్రోత్సహించాలని సూచించారు. ప్రత్యామ్నాయ పంటలకు అవసరమైన విత్తనాలను ముందుగానే సిద్ధంగా ఉంచి రైతులకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, డిఆర్ఓ ప్రేమ్ రాజ్, జడ్పి సిఇఓ శిరీష, డిఆర్డిఓ పిడి సన్యాసయ్య, డిఎంహెచ్ఓ వెంకటరమణ, డిఎఓ శ్రీధర్ రెడ్డి, డిఎఫ్ఓ దామోదర్ రెడ్డి, సిపిఓ కిషన్, ట్రైని డిప్యూటీ కలెక్టర్స్ రవితేజ, అనూష, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ల్యాండ్ చీటింగ్ కేసులో నిందితుడి అరెస్టు...




**– చివ్వెంల పోలీసులు., రిమాండ్‌కు తరలింపు**

**– సూర్యాపేట రూరల్ సిఐ రాజశేఖర్**

**సూర్యాపేట రూరల్, జూలై 16 (సూర్య సేన) :** లేని భూమిని ఉన్నట్లుగా, ఇతరులకు చెందిన భూమి తనదిగా చూపి అమాయక ప్రజలకు అమ్ముతూ డబ్బులు తీసుకుని మోసానికి పాల్పడుతున్న వ్యక్తినీ సూర్యాపేట రూరల్ పోలీస్లు గురువారం అరెస్టు చేశారు. సిఐ వెల్లడించిన వివరాల ప్రకారం అయిలాపురం గ్రామ శివారులో ఉన్న భూమిని ప్లాట్లుగా విక్రయిస్తానని చెప్పి, ఇతరుల భూమిని తనదిగా నమ్మబలికి కోడదల వెంకన్న, కోడదల కనకయ్యల వద్ద నుంచి భారీ మొత్తంలో నగదు వసూలు చేసిన కాసర్ల సురేందర్ రెడ్డి, అనంతరం భూమిని రిజిస్ట్రేషన్ చేయకపోవడంతో బాధితుడు కోడదల వెంకన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు చివ్వెంల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయబడింది దీని దర్యాప్తు చేసి నిందితున్ని రిమాండ్ కు తరలించడం జరిగినది అని సూర్యాపేట రూరల్ సిఐ రాజశేఖర్ తెలిపినారు. వ్యవస్థీకృత నేరాలకు పాల్పడుతున్న నిందితుడు, లేని భూమిని ఉన్నట్లుగా, ఇతరులకు చెందిన భూమి తనదిగా చూపి అమాయక ప్రజలకు అమ్ముతూ డబ్బులు తీసుకుని మోసానికి పాల్పడుతున్నట్లు గుర్తించాం అన్నారు.

కేసు దర్యాప్తును చివ్వెంల ఎస్ఐ మహేశ్వర్ చేపట్టగా, విచారణలో సంబంధిత భూమి కాసర్ల సురేందర్ రెడ్డికి చెందినది కాదని, ఇతరుల భూమిని తనదిగా చూపించి బాధితులను మరియు ఇతరులను కూడా మోసం చేసినట్లు తెల్సింది. భాదితులు ఎవరైనా ఉంటే పోలీస్లను ఆశ్రయించగలరు దర్యాప్తులో సేకరించిన ఆధారాల మేరకు నిందితుడు కాసర్ల సురేందర్ రెడ్డి ను ఈ రోజు సూర్యాపేట రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీ జి. రాజశేఖర్ అరెస్టు చేసి, న్యాయస్థానం ముందు హాజరుపరచగా కోర్టు రిమాండ్ విధించింది.

భూముల కొనుగోలు, విక్రయాల సందర్భంగా సంబంధిత పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి, యాజమాన్య హక్కులను రెవెన్యూ అధికారుల ద్వారా ధృవీకరించుకున్న అనంతరమే లావాదేవీలు నిర్వహించాలని పోలీసులు ప్రజలకు సూచించారు.

# జర్నలిస్టుల సమస్యలను తప్పకుండా పరిష్కరిస్తాం



**– ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు**

**– మంత్రిని కలిసిన టీడబ్ల్యూజేఎఫ్ నేతలు**

**హైదరాబాద్, జూలై 16 (సూర్య సేన) :** రాష్ట్రంలోని జర్నలిస్టులు ఎన్నో సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. జర్నలిస్టుల సంక్షేమం, వృత్తిపరమైన భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఆయన పేర్కొన్నారు. గురువారం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య నేతృత్వంలోని ప్రతినిధి బృందం మంత్రి శ్రీధర్ బాబు ను హైదరాబాద్ లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి "టీడబ్ల్యూజేఎఫ్ మీడియా డైరీ" ని అందజేసింది. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న పలు కీలక సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లింది. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల సంక్షేమ అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, త్వరితగతిన పరిష్కారానికి చర్యలు చేపట్టాలని మామిడి సోమయ్య విజ్ఞప్తి చేశారు.

దీనికి స్పందించిన మంత్రి శ్రీధర్ బాబు, జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తుందని, ముఖ్యమంత్రితో చర్చించి వీలైనంత త్వరగా పరిష్కార

ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ ప్రతినిధులు కుంచెం శ్రీనివాస్, వి. రవికుమార్, పర్కాల సమ్మయ్య గౌడ్, చొల్లేటి బ్రహ్మచారి, ఎం.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఫ్రిజ్‌లో పాలు పెడుతూ విద్యుదాఘాతంతో మహిళ మృతి

**హుజూర్నగర్ ప్రతినిధి, జూలై 16 (సూర్య సేన) :** హుజూర్‌నగర్ పట్టణంలో గురువారం తెల్లవారుజామున జరిగిన విషాద ఘటనలో విద్యుదాఘాతానికి గురై మహిళ మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తెప్పని రంగమ్మ (45) అర్ధరాత్రి సమయంలో పాలను ఫ్రిజ్‌లో పెట్టేందుకు వెళ్లగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందింది. ఉదయం నిద్రలేచిన ఆమె భర్త తెప్పని శ్రీను గమనించి ఫ్రిజ్ విద్యుత్ సరఫరా నిలిపివేసి చూడగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు గుర్తించారు. భర్త ఫిర్యాదు మేరకు హుజూర్‌నగర్ ఎస్ఐ నరేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

# 61 కోట్లు దాటిన డిజిటల్ పేమెంట్స్



**హైదరాబాద్ జూలై 16 (సూర్య సేన) :** స్మార్ట్‌ఫోన్లలో ఉండే బయోమెట్రిక్ అథెంటికేషన్ (ఆన్-డివైస్) ఆధారంగా జరిగిన యూపీఐ పేమెంట్లు 2026 జూన్ నెలలో 61.1 కోట్లు దాటాయి. ఈ మొత్తం లావాదేవీల విలువ రూ. 25,416 కోట్లుగా నమోదైంది. రోజువారీ అవసరాల కోసం ప్రజలు ఈ విధానాన్ని ఎంతగానో ఆదరిస్తున్నారని ఈ గణాంకాలు చెబుతున్నాయి. ఈ ఫీచర్ ద్వారా వినియోగదారులు తమ స్మార్ట్‌ఫోన్‌లోని ఫింగర్‌ప్రింట్ లేదా ఫేషియల్ రికగ్నిషన్ ఉపయోగించి జఖఎ పేమెంట్లను సులభంగా పూర్తి చేయవచ్చు.యూపీఐ వినియోగదారులు తమ రోజువారీ చెల్లింపుల కోసం బయోమెట్రిక్ ఆధారిత అథెంటికేషన్ ఎక్కువగా ఎంచుకుంటున్నారు. ఇది డిజిటల్ చెల్లింపుల రంగంలో మరింత వేగవంతమైన, సరళమైన మరియు సులువైన పద్ధతి వైపు మారుతున్న కాలానికి సంకేతంగా నిలుస్తోంది. ఈ ఫీచర్ వ్యక్తుల మధ్య జరిగే చెల్లింపులకు , అలాగే వ్యాపారులకు చేసే చెల్లింపులకు కూడా సపోర్ట్ చేస్తుంది. దీనివల్ల నిత్యం చేసే చెల్లింపులు మరింత వేగంగా, సులువుగా పూర్తవుతున్నాయి.ఈ బయోమెట్రిక్ అథెంటికేషన్ సదుపాయం రూపే క్రెడిట్ కార్డ్ ఆన్ యూపీఐ లావాదేవీలకు కూడా అందుబాటులో ఉంది. దీనివల్ల యూపీఐ పిన్ అవసరం లేకుండానే క్రెడిట్ కార్డ్ ద్వారా పేమెంట్లు చేయవచ్చు. సాధారణంగా సేవింగ్స్ ఖాతా నుండి యూపీఐ పేమెంట్ చేసేటప్పుడు ఉండే అదే వేగం, సౌకర్యాన్ని ఇది క్రెడిట్ కార్డ్ లావాదేవీలకు కూడా అందిస్తుంది."

# ధనుష్ మూవీలోకి సారా!



సినీ వైకుంఠపాళిలో ఎవరిని ఎప్పుడు ఏ పాము కాటేస్తుందో... ఏ నిచ్చెన ఎవరిని పైకి తీసుకెళుతుందో ఊహించడం కష్టం. కెరీర్ హాయిగా, జాలీగా సాగిపోతోందని అనుకునేంతలో కొన్ని అవకాశాలు చేజారిపోతుంటాయి. నిస్తేజంగా ఉన్న కొందరిని ఊహించని కొన్ని విజయాలు... హఠాత్తునగా నిచ్చెనలు ఎక్కించేస్తు ంటాయి. ప్రస్తుతం రుక్మిణీ వసంత్, సారా అర్జున్ విషయంలో అదే జరుగుతోంది. 'కాంతార 2' సినిమాతో గొప్ప విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది రుక్మిణీ వసంత్. ఇప్పుడు ఆమె కెరీర్ గ్రాఫ్ బాగుంది. ఎన్టీఆర్, నీల్ మూవీలోనూ రుక్మిణీ వసంత్ నాయికగా చేస్తోంది. అయితే... ఆ క్రేజీ ప్రాజెక్టే... ఇప్పుడు ఆమె పాలిట శాపంగా మారిపోయింది. పలుమార్లు ఈ సినిమా షెడ్యూల్స్ పోస్ట్ పోన్ అయ్యాయి. దాంతో ఆర్టిస్టుల డేట్స్‌ను సెట్ చేసుకోవడం మేకర్స్‌కు పెద్ద కష్టంగా మారిపోయింది. ఇలాంటి సమయంలో ఓ కీలకమైన పాత్రను రుక్మిణీ వసంత్ చేజార్చుకోవాల్సి వచ్చింది. ప్రముఖ తమిళ స్టార్ హీరో ధనుష్ ప్రస్తుతం 'కర' మూవీ చేస్తున్నాడు. ఇది ఏప్రిల్ 30న విడుదల కాబోతోంది. అలానే దీనితో పాటు తమిళరాసన్ పచ్చముత్తు దర్శకత్వంలోనూ ధనుష్ ఓ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు. ఇందులో రుక్మిణీ వసంత్‌ను హీరోయిన్‌గా తీసుకున్నారు.

కానీ ఇప్పుడు ఆమె డేట్స్ అడ్జస్ట్ చేయలేకపోవడంతో... ఆ స్థానంలోకి సారా అర్జున్ వస్తున్నట్టు తెలుస్తోంది. నిజానికి సారా అర్జున్ తమిళ ప్రేక్షకులకు సుపరిచితమే. బాలనటిగా ఆమె పలు తమిళ చిత్రాలలో నటించి, మంచి గుర్తింపు తెచ్చుకుంది. అలానే యవ్వన ప్రాయం లోకి అడుగు పెడుతున్న తరుణంలో మణిరత్నం 'పొన్నియన్ సెల్వన్'లోనూ నటించింది. అయితే... 'ధరుంధర్' మూవీతో సారా అర్జున్ రేంజ్ అమాంతంగా పెరిగిపోయింది. మరీ ముఖ్యంగా 'ధురంధర్' ఫ్రాంచైజ్ చిత్రాలు రెండు కలిసి మూడువేల కోట్ల గ్రాస్‌ను సాధించడం చిన్న విషయం కాదు. ఆ సినిమాలలో నటించిన సారా... ఇప్పుడు ధనుష్ సరసన నటించడం అంటే... ఖచ్చితంగా ఆ ప్రాజెక్ట్ రేంజ్ పెరుగుతుంది. అయితే... దీనికి సంబంధించి అధికారిక ప్రకటన ఎప్పుడు వస్తుందో చూడాలి.

# రెమ్యునరేషన్ లేకుండా సినిమా




సినిమా కళాత్మక వ్యాపారం. ఇక్కడ తారలు తమ ఇమేజ్‌ను బట్టి పారితోషాకాల్ని డిమాండ్ చేస్తుంటారు. ఇక అగ్ర తారలైతే రెమ్యునరేషన్ విషయంలో ఏమాత్రం రాజీపడరు. కానీ ఈ ధోరణికి భిన్నంగా అగ్ర కథానాయిక తమన్నా 'ఓ రోమియో' అనే హిందీ సినిమాలో అతిథి పాత్రలో నటించినందుకుగాను ఎలాంటి పారితోషికాన్ని తీసుకోలేదట. ప్రస్తుతం ఈ విషయం బాలీవుడ్‌లో హాట్‌టాపిక్‌గా మారింది. షాహిద్‌కపూర్, త్రిప్తి డిమ్రి జంటగా నటించిన ఈ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌కు విశాల్ భరద్వాజ్ దర్శకత్వం వహించారు. ఈ నెల 13న ప్రేక్షకుల ముందుకురాను ంది. ప్రచార కార్యక్రమాల సందర్భంగా దర్శకుడు విశాల్ భరద్వాజ్ రెమ్యునరేషన్ల అంశం గురించి మాట్లాడారు. కథానాయిక తమన్నా, 12th ఫెయిల్' ఫేమ్ విక్రాంత్ మస్సే ఈ సినిమాలో అతిథి పాత్రల్లో నటించారని, తనతో ఉన్న స్నేహసంబంధాలతో పాటు ఓ మంచి కథకు న్యాయం చేయాలనే ఉద్దేశ్యంతో వారిద్దరూ పైసా పారితోషికాన్ని తీసుకోకుండానే నటించారని, ఈ రోజుల్లో అంతటి ఉదార స్వభావం ఉన్న వారు అరుదని ప్రశంసించారు.

గెస్ట్‌రోల్ కోసం కొన్ని రోజులే కేటాయించినా.. ఇప్పుడున్న వ్యాపార దృక్కోణంలో ఉచితంగా నటించడం గొప్ప విషయమని బాలీవుడ్ వర్గాలంటున్నాయి. గత ఏడాది వచ్చిన 'ఓదెల-2' తర్వాత తెలుగులో తమన్నా మరే చిత్రానికి సైన్ చేయలేదు.

### అల్లు అర్జున్- ప్రశాంత్ నీల్ ప్రాజెక్ట్..

# ఎదురుచూపులు తప్పవా?






ప్రస్తుతం టాలీవుడ్‌లో ఎక్కడ చూసినా ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ రాబోయే చిత్రాల గురించే చర్చ జరుగుతోంది. 'పుష్ప 2' సృష్టించిన ప్రభంజనం తర్వాత, బన్నీ తన తదుపరి సినిమాల విషయంలో ఎంతో పకడ్బందీగా అడుగులు వేస్తున్నారు. ముఖ్యంగా అట్లీ దర్శకత్వ ంలో తెరకెక్కనున్న 'రాకా' చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ ప్రాజెక్ట్ అనౌన్స్ అయినప్పటి నుంచే సోషల్ మీడియాలో దీనిపై రకరకాల ఊహాగానాలు మొదలయ్యాయి. అట్లీ మార్క్ మాస్ ఎలిమెంట్స్, బన్నీ స్టైలిష్ యాక్షన్ తోడైతే బాక్సాఫీస్ వద్ద రికార్డులు తిరగరాయడం ఖాయమని ఫ్యాన్స్ నమ్ముతున్నారు. ఈ సినిమా షూటింగ్ ప్రారంభానికి ముందే ట్రేడ్ వర్గాల్లో విపరీతమైన క్రేజ్ ఏర్పడటం విశేషం. ఇదిలా ఉంటే, అభిమానులు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్న ప్రశాంత్ నీల్-అల్లు అర్జున్ కాంబినేషన్ పట్టాలె క్కడానికి మరికొంత కాలం వేచి చూడాల్సిందేనని తెలుస్తోంది. ప్రశాంత్ నీల్ ప్రస్తుతం ఎన్టీఆర్‌తో కలిసి తన తదుపరి భారీ యాక్షన్ ఎంటర్టైనర్‌ను రూపొందించే పనిలో నిమగ్నమై ఉన్నారు. ఈ చిత్రం రెండు భాగాలుగా రాబోతుండటంతో నీల్ పూర్తి సమయాన్ని దీనికే కేటాయించాల్సి వస్తోంది. తన పనితీరులో ఎక్కడా రాజీపడని నీల్, 'ఎన్టీఆర్‌నీల్' ప్రాజెక్ట్ రెండు భాగాలను పూర్తి చేసిన తర్వాతే ఇతర సినిమాలపై దృష్టి పెట్టే అవకాశం ఉంది. ఈ షెడ్యూల్ సంక్లిష్టత కారణంగానే బన్నీతో ఆయన చేయబోయే సినిమా కొంత ఆలస్యమయ్యేలా కనిపిస్తోంది. మరోవైపు అల్లు అర్జున్ కాల్ షీట్లు కూడా పూర్తిగా నిండిపోయాయి. ప్రస్తుతం 'రాకా' సినిమాపై దృష్టి సారించిన ఐకాన్ స్టార్, అది పూర్తయిన వెంటనే లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో తన 23వ చిత్రాన్ని ప్రారంభించాల్సి ఉంది.

లోకేష్‌తన సినిమాటిక్ యూనివర్స్‌తో ఇప్పటికే సంచలనం సృష్టిం చిన నేపథ్యంలో, బన్నీతో ఆయన చేసే సినిమా ఎలా ఉండబోతు ందోనన్న ఆసక్తి అందరిలోనూ ఉంది. అట్లీ, లోకేష్ వంటి స్టార్ డైరెక్టర్లతో వరుసగా పని చేయాల్సి ఉండటంతో, ప్రశాంత్ నీల్ ప్రాజెక్ట్‌కోసం సమయం సర్దుబాటు చేయడం బన్నీకి కూడా సవాలు గా మారింది. ఈ ఇద్దరు స్టార్స్ తమ ముందున్న బాధ్యత లను పూర్తి చేసే వరకు ఈ క్రేజీ కాంబో సెట్స్‌పైకి వెళ్లడం కష్టమే. అల్లు అర్జున్, ప్రశాంత్ నీల్‌కలయికలో సినిమా అంటే..అది కేవలం ఒక ప్రాంతీయ చిత్రంలా కాకుండా, భారతీయ చలనచిత్ర స్థాయిని పెంచేలా ఉంటుందనడం లో ఎటువంటి అతిశయోక్తి లేదు.

### క్రేజీ సీక్వెల్ 'ఆవేశం 2'

# పుష్ప యాక్టర్ ఫహాద్ ఫాసిల్ ఏం చెప్పాడంటే..?



తెలుగు ప్రేక్షకుల్లో సూపర్ ఫ్యాన్ బేస్ ఉన్న మాలీవుడ్ స్టార్ హీరోల్లో టాప్‌లో ఉంటాడు ఫహద్ ఫాసిల్. ఈ క్రేజీ యాక్టర్ నటించిన మాలీవుడ్ యాక్షన్ కామెడీ డ్రామా ఆవేశం.రోమాంచం ఫేం జీతూ మాధవన్ డైరెక్ట్ చేశాడు. సుమారు రూ.30 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ మూవీ గ్లోబల్ బాక్సాఫీస్ వద్ద రూ.100 కోట్లకుపైగా వసూళ్ల రాబట్టి టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలిచింది. ఈ చిత్రంలో ఫహద్ ఫాసిల్ పోషించిన రంగ పాత్రకు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది.కాగా ఈ క్రేజీ చిత్రానికి సీక్వెల్ రాబోతుందన్న వార్త ఇప్పుడు మూవీ లవర్స్‌ను ఖుషీ చేస్తోంది. తాజాగా ఓ ఈవెంట్‌లో సీక్వెల్‌పై క్లారిటీ ఇచ్చాడు ఫహద్ ఫాసిల్. ఆవేశం 2 ఉంటుందని అధికారికంగా ప్రకటించాడు. సీక్వెల్ 2027 లేదా 2028లో మొదలు కానుందని కూడా క్లారిటీ ఇచ్చాడు. డైరెక్టర్ జీతూ మాధవన్ సూర్యతో చేస్తున్న తన తొలి తమిళ చిత్రంతో బిజీగా ఉన్నాడు. ఈ మూవీతోపాటు ఫహద్ ఫాసిల్ కమిట్ మెంట్స్ పూర్తయిన తర్వాత ఆవేశం 2 సెట్స్‌పైకి వెళ్లనుందట. మొత్తానికి పుష్ప యాక్టర్ అభిమానులు, మూవీ లవర్స్‌కు ఇది గుడ్ న్యూస్ అనే చెప్పాలి.ఓ వైపు ఫహద్ ఫాసిల్ అండ్ టీం కామిక్ టైమింగ్.. మరో యాక్షన్ ఎలిమెంట్స్‌తో సాగే ఆవేశం చిత్రానికి సీక్వెల్‌గా రాబోతున్న ఆవేశం 2 అంచనాలు అమాంతం పెరిగిపోతున్నాయి. ఆవేశం చిత్రాన్ని ఫహద్ ఫాసిల్-నజ్రియా నజీమ్, అనవ్ర్ రషీద్ సంయుక్తంగా నిర్మించారు.

## ఏడేళ్ల తర్వాత...
## మళ్లీ వస్తున్న 'మడోన్నా'

పాప్ సంగీత ప్రపంచానికి రాణిగా పేరుగాంచిన మడోన్నా.. ఏడేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ సంగీత ప్రియులను పలకరించేందుకు సిద్ధమయ్యారు. 67 ఏళ్ల ఈ సింగర్, తన 15వ స్టూడియో ఆల్బమ్‌కు సంబంధించిన వివరాలను మరో రెండు రోజుల్లో ప్రకటించనున్నారు. 2019లో వచ్చిన 'మేడమ్ ఎక్స్' తర్వాత మడోన్నా నుంచి వస్తున్న ఆల్బమ్ ఇదే కావడంతో అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నా యి. ఈ ఆల్బమ్‌ను మడోన్నా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నా రని సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. గత కొన్నేళ్లుగా ఆమె ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నారు. 2023లో సెప్సిస్‌తో ప్రాణాపాయం నుంచి బయటపడగా, ఆ తర్వాత ఏడాది తన సోదరుడు క్రిస్టోఫర్‌ను కోల్పోయారు. ఈ అనుభవాలన్నీ ఆమె కొత్త ఆల్బమ్‌లో ప్రతిబింబి స్తాయని తెలుస్తోంది. 2005లో తనకు బ్లాక్‌బస్టర్ హిట్ ఇచ్చిన 'కన్ఫెషన్స్ ఆన్ ఏ డ్యాన్స్ ఫ్లోర్' ఆల్బమ్ ప్రొడ్యూసర్ స్టువర్ట్ ప్రైస్‌తో మడోన్నా మళ్లీ పనిచేస్తున్నారు. ఇది ఆల్బమ్‌పై అంచనాలను మరింత పెంచుతోంది. మరోవైపు, ఈ ఆల్బమ్‌లో పాప్ స్టార్ బ్రిట్నీ స్పి యర్స్‌తో కలిసి పనిచేసేందుకు మడోన్నా ప్రయత్నిస్తున్నట్లు కూడా వార్తలు వస్తున్నాయి. సుమారు 23 ఏళ్ల క్రితం 'మీ ఎగైనెస్ట్ ది మ్యూజిక్' పాటతో వీరిద్దరూ సంచలనం సృష్టించారు. బ్రిట్నీ ఒక అద్భుతమైన కళాకారిణి అని, ఆమెతో కలిసి పనిచేయడానికి మడోన్నా ఆసక్తిగా ఉన్నారని బ్రిట్నీ సన్నిహిత వర్గాలు తెలిపాయి.



E-PAPER

visit us @ http://e-paper.sooryasena.com



www.sooryasena.com

# సిద్ధూ జొన్నలగడ్డ కొత్త చిత్రం

## డైరెక్టర్ ఆర్ఎస్‌జెతో మూవీ

టాలీవుడ్ స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ కొత్త సినిమాను ప్రారంభిం చాడు. ప్రస్తుతం సరైన హిట్లు లేక సతమవుతున్న సిద్ధు తన తదుపరి చిత్రాన్ని దర్శకుడు స్వరూప్ ఆర్ఎస్‌జే (ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ ఫేమ్) తో చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఈక్రేజీ కాంబినేషన్‌లో రాబోతున్న చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సం స్థలు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ మరియు ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ప్రస్తుతం 'ప్రొడక్షన్ నెం. 40'గా పిలుస్తున్న ఈ సినిమాకు సంబంధించి త్వరలోనే మరిన్ని వివరా లను చిత్రబృందం వెల్లడించనుంది. సిద్ధు తనదైన శైలిలో మరోసారి వెండితెరపై మ్యాజిక్ చేయడానికి సిద్ధమవుతున్నారని ఈసారి బాక్సాఫీస్ వద్ద బ్లాస్ట్ ఖాయమని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తూ సిద్ధుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపింది.




EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **PALVAI JANAIAH,** PRINTED AT **R K ART PRINTERS,** H.NO. 1-9-277/23/B, VIDYANAGAR, NALLAKUNTA, HYDERABAD-500044, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 2-1-115/3/16/1, MAMILLAGADDA, SURYAPET-508213,NALGONDA DISTRICT, TELANGANA STATE. **EDITOR : PALVAI JANAIAH,**
**RNI. No: TELTEL/2023/85598,** CELL: 9951241048, EMAIL : srptsurya@gmail.com